


శభాష్.. పిల్లలూ..!

» వివిధ రంగాల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు

» నేడు బాలల దినోత్సవం

■ లోపలి పేజీలో..



ఉప్పుటేరు ఆక్రమణలను.. ఎలా తొలగించాలి?



- » కొల్లేరు వరద ముంపు నివారణ చర్యలేమిటి ?
- » ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అటవీ శాఖ ప్రిన్సిపల్ కన్సర్వేటర్ చలపతిరావు ఆదేశం
- » ఏలూరు, పశ్చిమ జిల్లాల అధికారులతో సమీక్ష
- » అభయారణ్యంపై సీఈసీకి త్వరలో నివేదిక



రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ కన్సర్వేటర్ డాక్టర్ పీవీ చలపతిరావు, చిత్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి, తదితరులు

ఏలూరు/ఏలూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కొల్లేరులో వరద ముంపును నివారించేందుకు ఉప్పుటేరు వద్ద ఆక్రమణలను ఎలా తొలగించాలి? సూచించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ కన్సర్వేటర్ డాక్టర్ పీవీ చలపతిరావు అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, పశ్చిమ గోదావరి జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అభయారణ్యం సరిహద్దులను గుర్తించండి. సుప్రీంకోర్టు నియమించిన సాధికారిత కమిటీ కోరిన అంశాలపై నివేదికను సిద్ధం చేయండి. కొల్లేరు ఆక్రమణల తొలగింపు, వరద ముంపు నివారణకు జలవనరుల శాఖ తీసుకున్న చర్యలపై సీఈసీ రూపొందించిన ప్రశ్నావళికి అనుగుణంగా నివేదికను సమర్పించాలి. ఉప్పుటేరు సరిహద్దులను గుర్తించి, నివేదికలు సమర్పించాలి. దీనికనుగుణంగా కొల్లేరులో వరద నియంత్రించేందుకు ఆక్రమణలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కొల్లేరు అభయారణ్యం సరిహద్దులను రూపొందించినప్పుడు ఇప్పటికే వున్న రికార్డులతో ప్రస్తుతం ఆధునిక లిడార్ సర్వే టెక్నాలజీ ద్వారా గుర్తించిన నివేదికలను, కొల్లేరు అభయారణ్యం పరిధిలోని జిరాయితీ, డి-ఫారం పట్టా భూముల వివరాలను సమర్పించాలి' అని స్పష్టం చేశారు. జేసీ ఎంజే అభిషేక్‌గౌడ, జిల్లా అటవీ శాఖాధికారి బి.విజయలక్ష్మి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ శేషుబాబు, ఎస్ఈ సీహెచ్ దేవప్రకాశ్, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమేష్, డీపీవో కె.అనురాధ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పత్సమట్ల వినతి

ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని కొల్లేరులో సంప్రదాయ వ్యవసాయం చేసుకుని రైతులు జీవనోపాధి కల్పించుకునేందుకు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ డాక్టర్ పీవీ చలపతిరావు, కలెక్టర్ కె.వెట్రిసెల్విలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కలెక్టరేట్‌లో గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. సంప్రదాయ వ్యవసాయం చేసుకుంటున్న రైతులను అటవీ శాఖాధికారులు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే వివరించారు. ఆయనతోపాటు కొల్లేరు రైతులు ఉన్నారు.



ఆముదాపల్లి రైతుల నిరసన

'అభయారణ్యం పేరుతో మా పొట్ట కొట్టవద్దు. సంప్రదాయ వ్యవసాయానికి అనుమతి ఇవ్వండి' అంటూ నిడమర్రు మండలం ఆముదాపల్లికి చెందిన కొల్లేరు రైతులు వేడుకున్నారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద గురువారం కొల్లేరు అభయారణ్య జిరాయితీ భూయజమానులు, రైతుల డి పట్టాదారుల హక్కుల సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన తెలిపారు. సమితి నాయకులు జి.గంగాధర్‌రావు, భలే వెంకటేశ్వరరావు, భలే నారదముని తదితరులు మాట్లాడుతూ ఆముదాలపల్లిలో 120 దళిత కుటుంబాలు నివసిస్తున్నామన్నారు. గ్రామ సొసైటీ ఆధ్వర్యంలో కొల్లేరులో పూర్వం నుంచి సంప్రదాయ వ్యవసాయమైన వరిని పండిస్తూ జీవనం సాగిస్తున్నామని, ఇటీవల తాము పొలం పనులు చేసుకుంటుండగా అటవీ శాఖ అధికారులు అనుమతి లేదని నిలిపివేశారన్నారు. అభయారణ్యంలో వ్యవసాయం చేయరాదంటూ మైకు ద్వారా టాంటాం వేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. వన్యప్రాణులకు ఎలాంటి అపాయం తలపెట్టబోమన్నారు.

దివ్యాంగుల నిర్ధారణకు వైద్యశిబిరాల షెడ్యూలు విడుదల

ఏలూరు అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా దివ్యాంగులను నిర్ధారించేందుకు నిర్వహించనున్న వైద్యశిబిరాలు, తేదీలతో కూడిన షెడ్యూలును సమగ్రశిక్షా అభియాన్ జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ గురువారం విడుదల చేశారు. ఈనెల 18న పోలవరం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు బుట్టాయిగూడెం జడ్పీ హైస్కూలు, 20న చింతలపూడి నియోజకవర్గం-చింతలపూడిలోని జడ్పీ హైస్కూలు, 22న కైకలూరు నియోజకవర్గం- కైకలూరులోని భవిత కేంద్రం, 25న ఉంగుటూరు నియోజక వర్గం -ఉంగుటూరులోని జడ్పీ హైస్కూలు, 27న నూజివీడు నియోజకవర్గం-నూజివీడు లోని ఎస్ఆర్ఆర్ జడ్పీ హైస్కూలు, 29న దెందులూరు నియోజకవర్గం- దెందులూరులోని జడ్పీ హైస్కూలు, డిసెంబరు 1న ఏలూరు నియోజకవర్గం-ఏలూరు లోని అశోకవర్ధన మున్సిపల్ పాఠశాలలోని భవిత కేంద్రంలో వైద్యశిబిరాలు జరుగుతాయని ఏపీసీ వివరించారు. ఈ శిబిరాల్లో వైకల్య నిర్ధారణ జరిగిన తర్వాత అర్హతగల వారికి తగిన ఉపకరణాలను ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంద న్నారు. వైద్యశిబిరాలకు హాజరైన బాలబాలికలకు, వారి తల్లిదండ్రులకు ఉచిత భోజన సదుపాయం, రవాణా ఖర్చులు సమగ్రశిక్షా అభియాన్ ద్వారా అందజేస్తామన్నారు.

పగలు టైలరింగ్.. రాత్రిళ్లు చోరీలు

■ లోపలి పేజీలో..

ఎల్ఆర్ఎస్‌కు గడువు పొడిగింపు

ఏలూరు,నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అనుమతి లేని లే-అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ గడువును వచ్చే ఏడాది జనవరి 23 వరకు పొడిగించిందని జేసీ, ఇడా వైస్ చైర్మన్ ఎంజే అభిషేక్ గౌడ తెలిపారు. భవనాలు, అంతస్తుల క్రమబద్ధీకరణకు బీపీఎస్ అమలు చేస్తోందని, ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి చేసిన అతిక్రమణలకే ఇది వర్తిస్తుందన్నారు.

సహకారం..పునర్జీవం!

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

సహకార వ్యవస్థను కొత్త పుంతలు తొక్కించడానికి అటు కేంద్రం, ఇటు రాష్ట్రం సంస్కరణలతో పయనించడంతో సొసైటీలు పరిపుష్టి అయ్యే దిశగా సాగుతున్నాయి. పాలకవర్గాలు లేని లోటు కొంత కనిపిస్తున్నా జిల్లాల్లో పర్సన్ ఇన్‌చార్జులు, సంఘాల్లో త్రిసభ్య కమిటీలతో దానిని భర్తీ చేసింది. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేసింది. ఆత్మ నిర్భర్ భారత్ సాధకాలుగా సహకార సంఘాలు పనిచేసేలా అవగాహన కార్యక్రమాలను జిల్లా అంతటా నిర్వహిస్తారు. తొలిరోజు డీసీసీబీ, డీసీఎంఎస్ కార్యాలయాలు, సహకార సంఘాల కార్యాలయాల వద్ద సహకార జెండాలను ఆవిష్కరిస్తారు. భారత ప్రభుత్వం 2021లో సహకార మంత్రిత్వ శాఖ ను ఏర్పాటు చేసింది. సహకారోద్యమానికి ప్రత్యేక విధానపరమైన పరిపాలన వ్యవస్థను ఏర్పాటు చేసింది. 'సహకార్ సే సమృద్ధి'లో భాగంగా సహకార సంస్థ కోసం వ్యాపార సంస్థల అభివృద్ధిని ప్రోత్సహించడం తదితర ముఖ్య కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఈ క్రమంలోనే సహకార వారోత్సవాలను నిర్వహించనున్నారు.

వారం పాటు కార్యాచరణ..

- 14న సహకార సంఘాల నిర్వహణ, జవాబుదారీతనం పెంపు
- 15న పరిశోధన, శిక్షణ, సహకార విద్య, సంస్కరణలపై అవగాహన
- 16న సహకార సంస్థల ద్వారా గ్రామీణాభివృద్ధి బలోపేతం చేయడం
- 17న జాతీయ సహకార విధానంపై అవగాహన
- 18న సహకారంతో బలహీనవర్గాల సాధికారత
- 19న పర్యాటక, ఆరోగ్య, హరితశక్తి రంగాల్లో సహకారాన్ని విస్తరించడం, 20న ప్రపంచ పోటీతత్వానికి దీటుగా వినూత్న సహకార వ్యాపార నమూనాలపై అవగాహన

» ప్రభుత్వాల దిద్దుబాటుతో సొసైటీల మనుగడ.. నేటి నుంచి వారం పాటు సహకార వారోత్సవాలు



కంప్యూటరీకరణ.. ఆన్‌లైన్ బిల్లుల జారీ

సహకార రంగాన్ని కంప్యూటరీకరణతో ఆధునికరిస్తూ, ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ సొసైటీలు (ప్యాక్స్) ద్వారా కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) ఏర్పాటు చేసింది. జాతీయ సహకార విధానం 2025ను ప్రకటించి సహకార ఉద్యమ భవిష్యత్‌కు దిక్సూచిలా పనిచేస్తోంది.

రికవరీలు తూచ్.. బాధ్యులపై చర్యలు శూన్యం

జిల్లాలో ఎనిమిది సహకార సంఘాల్లో ఆర్థిక అవకతవకలు భారీగా జరిగాయి. ఇందులో రూ.100 కోట్ల పైబడి నిధులను, డిపాజిట్లు, రుణాలను సిబ్బంది, కొన్నిచోట్ల వైసీపీ హయాంలోని పాలకవర్గాలు కుమ్మక్కై పక్కదారి పట్టించి.. గుటకాయ స్వాహా చేసేశారు. అయితే బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. రికవరీలు చేయాల్సి ఉన్న వాటిపై అతీగతీ లేదు.పలు విచారణలు పూర్తయినా, కొంతమందిని సస్పెండ్ చేసిన..స్వాహాకు సంబంధించిన రికవరీలు చేయాల్సి ఉంది. ఈ దిశగా సహకార వారోత్సవాల్లోనైనా కదలిక వస్తుందా.. అన్న చర్చ సాగుతోంది.

ఉమ్మడి జిల్లాలో 258 సొసైటీలుండగా 10 సొసైటీలు మినహా అన్ని సంఘాల్లోను కంప్యూటరీకరణ చేసి ఆన్‌లైన్ విధానంలో బిల్లుల జారీ జరుగుతోంది. ఏటా రెండు పంటలకు రూ.6,500 కోట్ల మేర రుణ ప్రణాళికతో డీసీసీబీ నడుస్తోంది. అయితే ఏళ్లతరబడి పేరుకుపోయిన రూ.286 కోట్ల బకాయిలే సహకార రంగానికి కోలుకోలేని దుస్థితికి కారణంగా చెబుతున్నారు.

మరిన్ని రంగాలకు విస్తరించేలా..

ప్రధానంగా వ్యవసాయం, గ్రామీణ రుణం, సూక్ష్మ సంస్థలు, మహిళా సాధికారత వంటి రంగాల్లో ఆత్మ నిర్భర్ భారత్ దార్శనికతను

(మిగతా 8వ పేజీలో)

జనవరి 12 నుంచి నరసాపురానికి వందేభారత్

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడకు నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జనవరి 12వ తేదీ నుంచి నరసాపురం వరకు నడపనున్నట్టు దక్షిణమధ్య రైల్వేశాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు రైల్ నెంబర్ 20677 డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - నరసాపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 5.30 గంటలకు చెన్నై సెంట్రల్ బయలుదేరుతుంది. రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, గుడివాడ, భీమవరం మీదుగా నరసాపురానికి 2.10 నిముషాలకు చేరుకుంటుంది. రైల్ నెంబర్ 20678 నర్సాపూర్ - డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.50 నిముషాలకు బయలుదేరి చెన్నై సెంట్రల్‌కు రాత్రి 11.45 నిముషాలకు చేరుకుంటుంది.

ధాన్యం సొమ్ములు చెల్లింపులో రికార్డు

- » ఇప్పటి వరకు 3,550 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- » పూర్తిస్థాయిలో రూ.ఆరు కోట్లు చెల్లింపులు

ఏలూరుసిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు జిల్లాలో ప్రారంభమయ్యాయి. ఈసారి విశేషమేమిటంటే ఇప్పటివరకు జిల్లాలో 290 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 3,550 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి పూర్తిస్థాయిలో రూ.ఆరు కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల లోపు ధాన్యం చెల్లింపులు చేయాల్సి ఉండగా అంతకంటే ముందుగానే కొంతమందికి గంటలో, కొందరికి నాలుగు గంటల్లోనే చెల్లింపులు చేయడం రికార్డుగా చెప్పవచ్చు. జిల్లాలో ఈసారి ధాన్యం కొనుగోలుకు 234 ఆర్ఎస్‌కేలను గుర్తించారు. వీటికి అనుబంధంగా 103 సహకార సంఘాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. మొత్తం 4లక్షల 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. 17లోపు తేమశాతం ఉన్న ధాన్యాన్ని ధర క్వింటాల్‌కు ఏ-గ్రేడ్‌కు సంబంధించి రూ.2,389, కామన్ రకానికి రూ.2369లకు కొనుగోలు చేస్తున్నారు. ఆపై తక్షణం ఎఫ్‌టీవో జనరేట్ చేసి మిల్లర్లు అథెంటికేషన్ పూర్తయిన వెంటనే ధాన్యం సొమ్ములను రైతులకు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ధాన్యం కొనుగోలు చేసిన నాలుగు గంటల్లోనే ధాన్యం సొమ్ములు రైతుల బ్యాంకు ఖాతాలకు చేరుతున్నాయి. 'జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈసారి రికార్డ్ స్థాయిలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి మొత్తం పేమెంట్ రూ.6 కోట్లు చెల్లించాం' అని సివిల్ సప్లయిస్ డీఎం పి.శివరామమూర్తి తెలిపారు.

ఆలయాలకు వచ్చే మహిళల భద్రత బాధ్యత అధికారులదే

పెనుగొండ వాసవీ మాత ఆలయాన్ని సందర్శించిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్



ఆలయంలో మహిళలతో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

పెనుగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, గౌరవం కాపాడటం ప్రతీ ఆలయాధికారుల బాధ్యత అని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. గురువారం పెనుగొండలోని నగరేశ్వర మహిషాసుర మర్ధని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళా భక్తులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. పలువురు మహిళలు ఆలయంలో తమపై పూజారి దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, ఆలయ పరిసరాల్లో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని మహిళా భక్తులు వివరించారు. తరచూ ఎదురవుతున్న చేదు అనుభవాలను వివరించారు. ఆలయంలో సీనియర్ ఉద్యోగి బంధువైన గణేష్ అనే వ్యక్తి అనధికారికంగా పౌరోహిత్యం చేస్తూ మహిళలతో దురుసుగా ప్రవరిస్తున్నాడని వివరించారు. తిట్లు, శాపనార్థాలు చేస్తూ భక్తులకు మనస్థాపం కలిగిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇప్పటికే దేవదాయశాఖ కమిషనర్‌కి ఫిర్యాదు చేసినా స్పందన రాలేదని తెలిపారు. మహిళా కమిషనర్ తరుపున న్యాయం జరుగుతుందనే నమ్మకంతో వినతిపత్రం అందజేశామన్నారు. రాయపాటి శైలజ మాట్లాడుతూ పవిత్ర స్థలాల్లో మహిళా భక్తుల భద్రతపై దేవదాయ శాఖ బాధ్యత వహించాలన్నారు. ప్రశాంతత కోసం ఆలయానికి వచ్చే మహిళా భక్తులపై ఇలాంటి ప్రవర్తన మానవతా విలువలుకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. మహిళలను మాటలతో కించపరిచే చర్యలు హింస కింద పరిగణించాల్సి వస్తుందన్నారు. అలాంటి వారిని కమిషన్ ఎట్టి పరిస్థితిల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. వెంటనే ఆలయ అధికారులు, స్థానిక పోలీసులు పిలిచి పూజారి, అతని కుమారుడిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనపై మహిళా కమిషన్ తరుపున సమగ్ర నివేదిక సేకరించి చర్యలు తీసుకుంటామని శైజల వెల్లడించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సత్తిబాబు, ఈవో రామ పెద్దింట్లు, సర్పంచ్ నక్కా శ్యామలాసోని శాస్త్రి, తహసీల్దార్ జి.అనిత కుమారి ఉన్నారు.

కాళ్లకూరు వెంకన్న ఆలయంలో సామూహిక సత్యవ్రతాలు



కాళ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం పర్వదినం పురస్కరించుకుని గురువారం భక్తులచే ఉచిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఏలూరు జిల్లా తాడినాడకు చెందిన వేగేశ్న వెంకట సూర్య సత్యనారాయణరాజు (ఏడుకొండల రాజు) దంపతులచే సుమారు వెయ్యి మంది దంపతులకు అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదం, స్వామివారి ప్రతిమలు అం దించారు. దేవస్థానం ఆస్థాన వేదపండితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ ఆలయ అర్చకులు సత్యదేవుని వ్రతాలు వేదోక్తంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం వారు భక్తులకు ఉచితంగా పూజా సామగ్రిని అందించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

క్షీరా రామలింగేశ్వరస్వామికి లక్ష పత్రిపూజ

పాలకొల్లు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామికి కార్తీక మాసం గురువారం సందర్భంగా అభిషేక పండితులు ఆధ్వర్యంలో స్వామివారికి లక్షపత్రి పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పంచారామ క్షేత్రాల పేరుతో వచ్చే యాత్రికులతో ఆలయం కిట కిటలాడింది. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు 2500 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. సుమారుగా 10 వేల మంది వరకూ స్వామి వారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం. పూజా కార్యక్రమాల్లో పాలక మండలి చైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. 12వ తేదీ బుధవారం స్వామివారికి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.38.250, లడ్డు విక్రయాల ద్వారా రూ.5.595 రూ 43.847 ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు.

వైభవంగా అర్ధవరం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పూలు, పండ్లతో తీర్చిదిద్దిన స్వామివారి రూపం

గణపవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం అర్ధవరంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత బాలవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మూడోరోజు వైభవంగా జరుగుతున్నాయి. వేదపండితులు నేతృత్వంలో పూలు, పండ్లతో వేంకటేశ్వరస్వామి రూపాన్ని తీర్చిదిద్దారు. అర్ధవరం పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామివారిని శేష వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు.

16న మార్టేరులో విప్లవవీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలకృష్ణారెడ్డి

పెనుమంట్ర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తొలి స్వాతంత్ర్య విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన పోరాటం కులం కోసం కాదని, దేశ ప్రజల స్వేచ్ఛ కోసమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వేణు గోపాల కృష్ణారెడ్డి (పెంటపాడు) అన్నారు. గురువారం మార్టేరు రెడ్డి కల్యాణమండపంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ ఆదివారం ఉదయం మార్టేరు సెంటర్‌లో నరసింహారెడ్డి విగ్రహం ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్లు- భవనాల శాఖా మంత్రి జనార్ధనరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఆచంట, అనపర్తి ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, నల్లి మిల్లి రామకృష్ణా రెడ్డిలు పాల్గొంటారన్నారు. సభ అనంతరం కార్తీక వనసమారాధన నిర్వ హించనున్నట్టు తెలిపారు. ఆదివారం ఉదయం పెనుగొండ వాసవీధామ్ నుంచి జరిగే బైక్ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి తాడి భీమారెడ్డి (విశాఖపట్నం), పంచగ్రామ రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు కే. కే.ఆర్. చంద్రశేఖర రెడ్డి, మేడపాటి చిరంజీవి రెడ్డి, తమనంపూడి వెంకట రెడ్డి, గుడిమెట్ల లక్ష్మణ రెడ్డి, అల్లం భాస్కర రెడ్డి, కర్రి చంటి రెడ్డి, చింతా ధర్మారెడ్డి, కొవ్వూరి అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన డబ్బులు- మన లెక్కలు యాప్‌తో అక్రమాలకు చెక్

డ్వాక్రా మహిళల సౌలభ్యం కోసం ఈ-నారీపై శిక్షణ : ఐకేపీ జిల్లా నాయకురాలు కోడేటి లక్ష్మీ కనకదుర్గ




పండితవిల్లూరు డ్వాక్రా మహిళలకు నిర్వహించిన సభలో మాట్లాడుతున్న కనకదుర్గ

పోడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :డ్వాక్రా సంఘాల్లోని మహిళల సౌలభ్యం కోసం ప్రభుత్వం రూపొందించిన మన డబ్బులు- మన లెక్కలు స్మార్ట్ ఫోన్ యాప్‌పై ప్రతీఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఐకేపీ జిల్లా నాయకురాలు కోడేటి లక్ష్మీ కనకదుర్గ కోరారు. గురువారం పండితవిల్లూరు సచివాలయం వద్ద డ్వాక్రా మహిళలకు నిర్వహించిన ఈ-నారీ శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తాము తీసుకున్న రుణాలు, చెల్లింపులను ఈయాప్ ద్వారా క్షణాల్లో తెలుసుకోవచ్చన్నారు. దీని ద్వారా అక్రమాలకు చెక్ పెట్టవచ్చన్నారు. సమావేశంలో నియోజకవర్గ టీడీపీ క్లస్టర్ ఇనిచార్జ్ గణపతినీడి రాంబాబు మాట్లాడుతూ గతంలో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలు, చెల్లింపుల్లో అనేక అక్రమాలు అవినీతి జరిగేదనీ మన డబ్బులు- మన లెక్కలు స్మార్ట్‌పోన్ యాప్‌తో ఇలాంటి వాటికి తావులేదన్నారు.

ఈ యాప్ గురించి ప్రతీ మహిళా తెలుసుకుని ఎప్పటికప్పుడు జాగ్రత్త పడాన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు మన డబ్బులు- మన లెక్కలు యాప్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రరాజు రమేష్‌రాజు, ఏపీఎం డి.సుహాసిని, సీసీ విజయకుమారి, మహిళా పోలీస్ కె.సుబ్బలక్ష్మి, సీఆర్‌పీ వికె.కుమారి తదితరులు పాల్గొన్నారు.



మాకేటి భయం.. మ్యాట్‌కు చిల్లు పెట్టి చెత్త వేస్తున్న దృశ్యం



చెత్త వేయద్దని అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



బాలయోగి వంతెన వద్ద తమ్మిలేరులో చెత్త వేయకుండా అధికారులు రెండువైపులా గ్రీన్ మ్యాట్ కట్టారు.. అయితే వాటికి రంధ్రాలు పెట్టి మరీ చెత్త వేస్తున్నారు..



మేం మారేదేలే !

తమ్మిలేరులో చెత్త వేయకుండా ఏలూరులో బాలయోగి వంతెనకు అటూ ఇటూ గ్రీన్ మ్యాట్‌లు కట్టారు.. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని చెత్త వేయవద్దని , వేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ అధికారులు ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేశారు..అయితే జనాలకు ఇవేమీ పట్టవు..ఎవరెట్లా పోతే మాకేంటి..? అనుకుని గ్రీన్‌మ్యాట్‌లకు ఏకంగా చిల్లులు పెట్టేశారు.. ఆ రంధ్రాల నుంచి చెత్త తమ్మిలేరులో వేస్తున్నారు..బాధ్యత లేనపుడు ఎన్ని పనులు చేపట్టినా మార్పు రాదు.. - ఫొటోగ్రాఫర్, ఏలూరు

ఆదరణ ఏదీ ?

అంతకంతకూ తగ్గుతున్న పఠనాసక్తి

గ్రంథాలయాల్లో కనిపించని పాఠకులు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో..కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో"- అని కందుకూరి వీరేశలింగం చెప్పిన నాటి సలహా వింటే పుస్తకం చదవడం వల్ల ఎంత జ్ఞానం సంపాదించవచ్చో పుస్తకజ్ఞానం వల్ల ఒక మనిషి ఎంత పరిపూర్ణత సాధించవచ్చో అర్థం చేసుకోవచ్చు. పఠనాసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వాలు గ్రంథాలయాలు అందుబాటులో ఉంచాయి. కానీ అంతకంతకూ వాటికి ఆదరణ తగ్గుతోంది. దీన్ని నేటి తరానికి పరిచయం చేయాలని గ్రంథాలయాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏటా నవంబర్ 14 నుంచి 20 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 72 గ్రంథాలయాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 72 గ్రంథాలయాలు ఉన్నాయి. వాటిలో గ్రేడ్-1 గ్రంథాయాలయాలు 6, గ్రేడ్- 2 గ్రంథాయాలు 3 ఉండగా మిగిలినవి గ్రేడ్ 3 కేటగిరీకి చెందుతాయి. గ్రేడ్ 1 గ్రంథాలయాలు నరసాపురం, ఏలూరు, భీమవరం, కొవ్వూరు, తాడేపల్లిగూడెం తణుకు పట్టణాల్లో ఉండగా చింతలపూడి, ఏలూరుల్లో గ్రేడ్ -2 గ్రంథాలయాలు కొనసాగుతున్నట్టుగా తెలుస్తోంది. గ్రామాల్లో ఏర్పాటైన గ్రంథాలయాలు నిర్వీర్యం అయిపోయాయి. గ్రామాల్లో గ్రంథాలయాల నిర్వహణ కోసం సెస్ వసూలు చేస్తున్నా అక్కడ కనీసం పుస్తకాలు ఏర్పాటు లేదనే ఆరోపణలు ఉన్నాయి. వీటితో పాటు మేజర్ పంచాయితీలైన దువ్వ, గణపవరం, తదితర ప్రాంతాల్లో గ్రంథాలయాలు స్టోర్ రూంలుగా మారిపోయాయి.

అంతా సెల్‌ఫోన్ మయం

గతంలో గ్రంథాలయాలను వినియోగించుకుని మంచి మంచి ఉద్యోగాల్లో స్థిరపడిన వారు ఎందరో ఉన్నారు. అటువంటి గ్రంథాలయాలను నేడ చిన్నచూపు చూస్తున్నారు. ఇటు చిన్నారుల దగ్గర నుంచి యువత వరకూ చేతిలో సెల్‌ఫోన్ తప్ప మరేమి కనిపించడం లేదు. గతంలో గ్రంథాలయాల నుంచి మెంబర్‌షిప్ ద్వారా పుస్తకాలు ఇంటికి తెచ్చుకుని మహిళలు చదివేవారు.

ఇప్పుడు టీవీలు వచ్చిన తర్వాత సీరియల్స్ చూసేందుకే తీరిక ఉండడం లేదు.. ఇక పుస్తకాలు చదివే సమయం ఎక్కడ ఉంటుంది..దీంతో గ్రంథాలయాలకు ఆదరణ కరువైంది. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ప్రభుత్వం గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి. అలాచేస్తే పాఠకులు ఆకర్షితులవుతారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఉద్యోగ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి గ్రంథల యాలు బాగా ఉపయో గపడతాయి.. అక్కడ అన్ని రకాల వార్తా పత్రికలు, కాంపిటేటివ్ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నారు.

నిర్వహణకు నిధులు

గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు జిల్లాలో ఉన్న గ్రేడ్ 1, 2 గ్రంథాలయాలకు రూ.15 వేల నుంచి 10 వేల వరకూ నిధులు విడుదల చేస్తారు. నిర్వహణకు బిల్లులు పెడితే ప్రభుత్వం నుంచి నిధులు అందిస్తారు.



తాడేపల్లిగూడెం గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులు

పిల్లలకు చదివే తీరిక ఏది ?



గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నా చదివే తీరిక నేటి యువతకు ఉండటం లేదు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న జ్ఞాన సంపద విలువ తెలియజేసే వారే కరువయ్యారు. ప్రభుత్వం వారోత్సవాల పేరుతో అవగాహన కల్పిస్తున్నా ఆశించిన స్థాయిలో ప్రయోజనం ఉండటం లేదు.

-పి.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం కొండ్రుప్రోలు

విద్యార్థులు, నిరుద్యోగులకు ప్రయోజనం



గతంతో పోలిస్తే ప్రస్తుతం పాఠకులు పెరిగారు. తాడేపల్లి గూడెం గ్రంథాలయానికి నిత్యం 150 మంది వరకు పాఠకులు వస్తున్నారు.ఇటు విద్యార్థులు, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నవాళ్లు, సీనియర్ సిటిజన్స్ గ్రంథాలయాలను బాగానే ఉప యోగించుకుంటున్నారు. వారికి ఉపకరించే బుక్స్ అందుబాటులో ఉన్నాయి.

- వానపల్లి శ్రీనివాస్, గ్రంథాలయ అధికారి, తాడేపల్లిగూడెం

శభాష్ ! పిల్లలూ..

వివిధ రంగాల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు

నేడు బాలల దినోత్సవం

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. సహజ సిద్ధంగా కొందరు పిల్లలకు కళలు అలవోకగా అబ్బుతాయి. దీనికి వారు చదువుకున్న పాఠశాలల్లో, ఇంట్లో ప్రోత్సాహం అవసరం. సృజనాత్మకత కలిగి ఉన్న నృత్యం, క్రీడలు, తదితర అంశాల్లో నిష్ణాతులైతే వారి విద్యాభ్యాసం మానసిక వికాసం రెండూ చక్కగా పురోగమిస్తాయి. కొందరు బాలలు తమకు నచ్చిన రంగాల్లో రాణిస్తున్నారు. బాలల దినోత్సవం సంద ర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న బాల, బాలికలపై కథనం.

- ఏలూరు రూరల్/ముదినేపల్లి (ఆంధ్రజ్యోతి)

రికార్డుల రాణి.. జాగృతి..



ఏ రంగంలోనైనా రికార్డు సాధించడ మంటే మాటలు కాదు. ఎంతో కష్టపడితే ఒకటో రెండో రికార్డులు మన పేర రాసుకోవచ్చు. కానీ కొన్నాళ్లకే మళ్లీ వాటిని ఎవరో ఒకరు అధిగమిస్తారు. కానీ ఏలూరుకు చెందిన నారాయణం జాగృతి ఇప్పటి వరకు 75కు పైగా రికార్డులు నెలకొల్పింది. ఆ బాలిక వయసు 11 ఏళ్ల 5 నెలలు. నిన్నటి వరకు 68 రికార్డులు సాధించిన ఆమె ఒకరోజే మరో 7 జాతీయ రికార్డులు నెలకొల్పి మొత్తంగా తన రికార్డుల సంఖ్య 75కు పెంచుకుంది. ఏలూరు నగరానికి చెందిన నారాయణం శివశంకర్, సుగుణ దంపతులు కుమార్తె జాగృతి. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన 6 తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఒక సూపర్ కిడ్ రికార్డు సాధించింది. నాలుగు నిమిషాల్లో తెలుగులో 108 కఠిన పదాలకు అర్థాలు చెప్పింది. ఎటు నుంచైనా ఒకేలా పలికే (భ్రమక) 108 పదాలను 3 నిమిషాల్లో చెప్పారు. 108 హిందీ పదాలకు తెలుగు, ఆంగ్లంలో 6 నిమిషాల్లో అర్థాలు, 108 తెలుగు కర్తరీ వ్యాక్యాలను 7 నిమిషాల్లోనే కర్మణీ వాక్యాలుగా మార్చి చెప్పారు. 8 నిమిషాల్లో 108 భాగవత ప్రశ్నలకు సమాధానాలు, 9 నిమిషాల్లో 108 సంధి పదాలకు విసంధి రూపాలు చెప్పి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదిం చింది. 75 మంది భారతీయ క్రీడాకారులు ఫోటోలు చూపిస్తే 8 నిమి షాలలో వారు ఏ క్రీడలో పేరు గాంచారో చెప్పడంతో సూపర్ కిడ్స్ రికార్డ్స్ స్థానం దక్కించుకుంది. ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమని జాగృతి పేర్కొంది.

నాట్యంలో నెమలితో పోటీ..



విద్యలో రాణిస్తూ సంప్రదాయాలను మరువలేదు. చదువుతో పాటు కూచిపూడి నృత్యంలో ప్రదర్శనలిచ్చి కళను కాపాడుతున్నారు. నిరంతర సాధనతో ప్రదర్శనలిచ్చి అబ్బురపరుస్తున్నది ఏలూరుకు చెందిన ఎన్.సిరి చందన శాస్త్రీయ నృత్యంలో ప్రతిభ చూపుతోంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుతోంది. ఈమె తండ్రి రాజ్‌కుమార్ శాస్త్రీయ నృత్య శిక్షకులు. దీంతో చిన్న వయసు నుంచే నాట్యంలో ప్రతిభ చాటుతోంది. పదవ తరగతి చదువుతున్న సిరి చందన అభినయ నృత్య భారతి నిర్వహించిన నృత్య పోటీలో ప్రథమ, హేలాపురి బాలల ఉత్స వంలో ప్రథమ, ప్రభుత్వం నిర్వహించిన కళా ఉత్సవాల్లో జిల్లాలో ప్రథమ, రాష్ట్రస్థాయిలో ప్రథమ, జాతీయస్థాయిలో ద్వితీయస్థానం సాధించింది. నాట్య రవళి, నాట్య మయూరి, నాట్య వసుంధర, నాట్య విపంచి, నంది అవార్డు, నాట్య తిలకం, అవార్డులు సొంతం చేసుకుంది. ద్వారకాతిరుమల, పెద్ద తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం, గోరఖ్‌పూర్, నేపాల్, శ్రీలంక, ప్రముఖ దేవాలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకుంది. మంచి నాట్య కళాకారునిగా స్థిరపడాలన్నదే సిరి చందన లక్ష్యంగా పేర్కొంది.

కొలనులో దిగితే పతకాల పంటే..



ఆ బాలుడు కొలనులో దిగితే పతకాల పంటే. అటు చదువు, ఇటు ఈత పోటీల్లో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటు న్నాడు. ఏలూరు నగరానికి చెందిన స్వామినాయుడు ఈత పోటీల్లో పాల్గొని పతకాలు కైవసం చేసుకుంటున్నాడు. ఇటీవల జరిగిన పదవ సబ్ జూని యర్ స్విమ్మింగ్ పోటీల్లో ఆయా విభాగాలలో ఐదు బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి ఈత పోటీలకు ఎంపికయ్యాడు. ఎస్జీఎఫ్ స్విమ్మింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు, ఒక వెండి సాధించాడు. తాజాగా జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఏలూరు బిశ్వనాథ్ భర్తియా ఈత కొలనులో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రతిరోజు విధిగా ఈత సాధన చేస్తూ స్విమ్మింగ్ శిక్షకుడు గణేష్ వద్ద మెలకువలు నేర్చుకుంటున్నాడు.

బరిలో దిగితే కబడ్డీ..కబడ్డీ



ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలేనికి చెందిన పక్కిరి జోషిబాబు, జ్యోతి దంపతుల కుమార్తె అమూల్య అల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో తొమ్మిదవ తరగతి చదువతోంది. హైస్కూల్లో చేరినప్పటి నుంచి ఆటలపై ఆసక్తి పెరగడంతో కబడ్డీ ఆటపై మక్కువ ఏర్పడి ప్రాక్టీస్ చేసింది. స్కూలు స్థాయిలో ప్రతిభ కనపర్చడంతో అమూల్య రెండు సంవత్సరాలుగా మండల నియోజకవర్గ, జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఆడి పలు బహుమతులు, ప్రశంసాపత్రాలు పొందింది. గతేడాది ఉమ్మడి కృష్ణా జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా జట్టులోస్థానం సాధించి కడపలో జరిగిన రాష్ట్రస్థాయి పాఠశాలల కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం సాధించింది.ప్రోత్సాహం ఉంటే గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా రాణిస్తారు

పీఎం శ్రీ పాఠశాల హెచ్‌ఎంపై ఆరోపణలు

సమగ్రశిక్ష అధికారుల విచారణ

ఏలూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రప్రభుత్వం నిర్ధేశిత ప్రామాణికాల మేరకు ఎంపికచేసిన పీఎంశ్రీ పాఠశాలలకు విడుదల చేసిన నిధుల వినియోగంలో పలు ఆరోపణలతో కూడిన ఫిర్యాదులందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో సూచనలతో సమగ్రశిక్షా అభియాన్ జిల్లా అధికారులు గురువారం పెదవేగి మండలంలోని ఓ హైస్కూలులో విచారణ నిర్వహించారు. స్కూలు అభివృద్ధికి కేంద్రం పీఎఫ్‌ఎంఎస్ ఖాతాకు జమచేసిన నిధులను వినియోగించడానికి పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్‌ఎంసీ) తీర్మానం, చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల సంతకాలు అవసరం కాగా, తమను సంప్రదించ కుండానే సంతకాలను స్కూలు హెచ్‌ఎం ఫోర్జరీ చేసి నిధులు కాజేశారని ఆరోపిస్తూ ఎస్‌ఎంసీ కార్యవర్గం ఫిర్యాదు చేసింది. ఇవే ఆరోపణలపై విచారణ నిర్వహించగా, స్కూలు అభివృద్ధి పనుల నిమిత్తం పీఎఫ్‌ఎంఎస్ ఖాతాకు కేంద్ర ప్రభుత్వం జమచేసిన రూ.1.59 లక్షల నిధుల నుంచి కొన్ని నిర్మాణపనులకు చేసిన ఖర్చులు పోను మిగతా రూ.89 వేలను ఎస్‌ఎంసీ చైర్మన్ ఖాతాకే పాఠశాల హెచ్‌ఎం జమ చేశారని, ఆ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఇంతవరకు ఖర్చు చేయలేదని విచారణలో తేలినట్టు సమాచారం. అయితే తొలుత ఖర్చుచేసిన రూ.70 వేలకు అవసరమైన ఎస్‌ఎంసీ తీర్మానం, దానిపై చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యుల సంతకాలను హెచ్‌ఎం ఫోర్జరీ చేశారన్న ఆరోపణలను నిగ్గు తేల్చాల్సింది విద్యాశాఖ కాదని, దానిపై పోలీసులకు ఎస్‌ఎంసీ ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని అధికార వర్గాలు భావిస్తున్నట్టు తెలిసింది. ఎస్‌ఎంసీకి వివిధ నిర్మాణ పనులను కేటాయించడం, నిధుల విని యోగం కొంతకాలంగా జరుగుతోందని, ఈ క్రమంలోనే స్కూలు హెచ్‌ఎంకు, ఎస్‌ఎంసీ చైర్మన్‌కు మధ్య ఇటీవల వివాదాలు ఏర్పడ్డాయని సమాచారం. దీనిపై సమగ్రశిక్షా అభియాన్ జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్‌ను వివరణ ఇస్తూ ఎస్‌ఎంసీ సభ్యుల సంతకాలను ఫోర్జరీచేసి నిధులను హెచ్‌ఎం కాజేశారని ఫిర్యాదుపై గురువారం విచారించారు. ప్రభుత్వం జమ చేసిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాలేదు. విచారణ నివేదికను డీఈవోకు అందజేస్తాం అని వివరించారు.


సెమీఫైనల్స్‌లో మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

పాలకొల్లులో నేడు టెన్నిస్ తుది సమరం

పాలకొల్లు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి జరుగుతున్న బుద్ధావతారం రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ గురువారం సెమీ ఫైనల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. విజేతలు శుక్రవారం 45, 55, 65,70 విభాగాల్లో ఫైనల్స్ ఆడతారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని భగవాన్‌రాజు తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద్‌రాజు, నరసాపురం టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్ పాల్గొంటారని వివరించారు.

విజేతలు : 70 సింగిల్స్ విభాగంలో (టౌన్‌హాల్) ఎస్.సేతు జీవి సన్యాసి రాజుపై విజయం సాధించగా డబుల్స్‌లో రాంబాబు, సేతులు రాధాకృష్ణ మూర్తి, జీవి సన్యాసి రాజులపై గెలుపొందారు. 65 సింగిల్స్‌లో వి.శ్రీనివాసరెడ్డి ఎం.ఉదయ్ భాస్కర్‌పై విజయం సాధించారు. డబుల్స్ విభాగంలో వి.శ్రీనివాసరెడ్డి, ఎస్ఎస్‌రాధలు సుబ్రహ్మణ్యం, పార్థసారధిలపై గెలుపుపొందారు. 55 సింగల్స్ విభాగంలో రమేష్ బాబూరాజపై విజయం సాధించారు. డబుల్స్ 45 ఏళ్ల సింగిల్స్ విభాగంలో ఎంఎస్ కిరణ్ రమేష్ బాలుపై విజయం సాధించారు. రెండో సెట్‌లో రెడ్డి నాగరాజు భాస్కరరావుపై విజయం సాధించారు.


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే బొలిశెట్టి

వైసీపీ నుంచి జనసేన గూటికి..

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తన ఊపిరి ఉన్నంత కాలం రాజకీయాలు వదలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలోకి సర్పంచ్ పిచికల రాజారావు, ఎంపీటీసీ దూలపల్లి సత్తియ్య, నాయకులు పిచికల అమ్మన్నలతో భారీగా జరిగిన చేరికల సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపులో బాగస్వాములైన కూటమి నాయకులందరినీ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని కొత్తగా పార్టీలో చేరే వారికి కూడా ప్రాధాన్యం ఉంటుందన్నారు. జడ్పీటీసీ ముత్యాల అంజనేయులు, జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, పుల్లా బాబి, నాయకులు తోట రాజా, బొడ్డుసాయిబాబా తదితరులు పాల్గొన్నారు. .

నేటి నుంచి సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాలలో జాతీయ సదస్సు


సదస్సు బ్రోచర్లను విడుదల చేస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఏలూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :ఔషధరంగం (ఫార్మసీ) లో కృత్రిమ మేథస్సు (ఏఐ) అవిష్కరణలు, అద్భు తాలపై ఈనెల 14, 15 తేదీల్లో ఏలూరు సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాలలో రెండురోజుల జాతీయ సదస్సుని నిర్వహిస్తున్నట్టు కరస్పాండెంట్ చలసాని విశ్వనాథ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు హరిప్రసాద్, మనోజ్ కుమార్ తెలిపారు. ఔషధ పరిశోధన, అభివృద్ధి, రోగి సంరక్షణలో కృత్రిమ మేథస్సు వినియోగంపై తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఫార్మసీ కళాశాలల నుంచి ప్రొఫెసర్లు, సీనియర్ సైంటిస్టులు, అధ్యాపకులు, 550 మందికిపైగా ఫార్మసీ విద్యార్థులు జాతీయ సదస్సులో పాల్గొంటారని వివరించారు. ఫార్మసీ రంగంలో పోటీతత్వం, మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే ఆధునిక సాంకేతికతను పాటించాల్సిందేనన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నిడమర్రు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో నవంబరు 8 నుంచి వ10 వతేదీ వరకు జరిగిన అంతరాష్ట్ర అండర్ 17 హ్యాండ్ బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించిన ఛానమిల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని బత్తిన ధరణి ప్రియ ఈనెల 11, 12 వతేదీలలో సివిల్ సర్వీసెస్ వాలీబాల్, మరియు బాస్కెట్ బాల్ టీంకు జిల్లా తరుపున ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ధరణిప్రియను, వ్యాయామ ఉపాధ్యాయిని వలపుల సౌజన్యలను ఎంఈఓ 2 యర్రంశెట్టి శేషగిరిరావు అభినందించారు.పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పెదకాపవరంలో కుక్క స్వైరవిహారం

12 మందిపై దాడి


గాయాలపాలైన బాధితులు

ఆకివీడు రూరల్ నవం బరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు మండలం పెద కాపవరంలో కుక్క స్వైర విహారం చేసి గ్రామంలో 12 మందిని కరిచి గాయపరిచింది. దారిని వెళ్ళేవారిని కరవడం పారిపో వడం చేస్తున్నదని, దానిని పట్టుకో వాలని ప్రయత్నించిన కనపడడం లేదని వాపోతున్నారు. ఎప్పుడు వస్తుందో ఎవరిమీద దాడి చేస్తుందోనని భయపడుతున్నారు. వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయని గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను పాటిస్తూ వీధి కుక్కలను గ్రామంలో బహిరంగంగా తిరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన లాయర్ విద్యాసాగర్ అధికారు లను కోరుతున్నారు. ప్రజలను కుక్కల బారినుంచి కాపాడాలని విన్నవిస్తున్నారు.

ఎనిమిది మంది విద్యార్థినులపై గేదె దాడి



భీమడోలు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భీమడోలు హైస్కూలు నుంచి వసతి గృహాలకు వెళ్తున్న ఎనిమిది మంది విద్యార్థినులపై గేదె దాడి చేసింది. భీమడోలు వసతి గృహంలో ఉంటూ హైస్కూల్లో చదువుతున్న ఏడుగురు విద్యార్థినులు, బాలుర వసతి గృహంలో చదువుతున్న మరో విద్యార్థి స్కూలు నుంచి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో సాయిబాబాగుడి వద్ద ఎదురుగా వస్తున్న గేదె ఉన్నట్టుండి వీరిని పొడవడంతో స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో నలుగురిని ఏలూరు తరలించగా మరో నలుగురిని భీమడోలు ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు వారిని పరామర్శించారు.

కబళిస్తున్న డయాబెటిస్



చిన్న రోగమైనా.. సమస్యలు పెద్దవి
నేడు ఇంటికో వ్యాధిగ్రస్తుడు

నేడు అంతర్జాతీయ మధుమేహ దినోత్సవం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతి ఐదుగురిలో ఒకరికి డయాబెటిస్‌కు మందులు వాడుతున్నారు. ఈ కారణంగా మనిషిలో గుండె, కిడ్నీ, మెదడు వంటి భాగాలపై ప్రభావం చూపిస్తూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులుగా మారుతున్నారు. నేడు అంతర్జాతీయ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

తణుకు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డయాబెటిస్ మానవులను వేధిస్తున్న రుగ్మత. ఆధునిక యుగంలో డయాబెటిస్ చికిత్సలో ఇన్సులిన్ ఆవిష్కరించిన తర్వాత విప్లవాత్మక మార్పులు వచ్చాయి. మధుమేహ నివారణకు 1921లో ఇన్సులిన్‌ను కనుగొన్న ఫ్రెడరిక్ బాంటింగ్ పుట్టిన రోజు సందర్భంగా నవంబరు 14న అంతర్జాతీయ డయాబెటిస్ దినోత్సవంగా నిర్వహించేందుకు అంతర్జాతీయ డయాబెటిక్ ఫెడరేషన్ (ఐడీఎఫ్), ప్రపంచ ఆరోగ్య సంస్థలు సంయుక్తంగా గుర్తించాయి. 2007లో ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి(యుఎన్‌వో) అధికారికంగా గుర్తించింది.

గతంలో పెద్దలకు మాత్రమే మధుమేహం ఉండేది. ఇప్పుడు చిన్న పిల్లల్లో సైతం కనిపిస్తున్నది. ఆహారపు అలవాట్లతోపాటు మారుతున్న జీవన పరిస్థితులు ఇందుకు కారణంగా చెప్పవచ్చు. చిన్న రుగ్మతగా ప్రారంభమై వ్యాధి ముదిరి 15 ఏళ్లు గడిచిన తర్వాత దీని ప్రభావం మానవుడి అన్ని అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మందులు, ఇన్సులిన్‌లకు లొంగని పరిస్థితి ఏర్పడుతుంది.

మధుమేహంలో రెండు రకాలు ఉంటాయి. టైప్-1 ఉన్న వారికి శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేదు. ఇది ఎక్కువగా చిన్న పిల్లల నుంచి 25 సంవత్సరాల లోపు యువకుల్లో కనిపిస్తుంది. దీని వల్ల బరువు తగ్గిపోతారు. టైప్-2 మధుమేహం వున్న వారి శరీరం ఇన్సులిన్ సరిగా ఉపయోగించుకోలేదు. దీని కారణంగా అధిక బరువు పెరుగుతారు. ఇది 30 సంవత్సరాల పైబడిన వారిలో కనిపిస్తుంది.

- **మధుమేహానికి కారణాలు**

ఆధునిక కాలంలో డయాబెటిక్ రావడానికి అనేక కారణాలు చెబుతారు. తెల్లని బియ్యం, మైదా, పంచదార, ఐస్‌క్రీమ్స్, తెల్లని ఉప్పు కారణాలుగా చెప్పవచ్చు. అలాగే ఎక్కువ సేపు కూర్చోవడం కూడా మధుమేహం రావడానికి కారణంగా ఉన్నది. ఆధునిక కాలంలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కువ మంది ఎక్కువ సమయం కూర్చునే ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కనీసం రోజుకు 20 నుంచి 30 నిమిషాలు నడక అవసరం. ఉద్యోగ, వ్యవహారాలు ఉరుకులు, పరుగులతో కూడుకుని ఉన్నది. దీని వలన శరీరంపై తీవ్ర ఒత్తిడి పెరిగి ఆ ఒత్తిడి డయాబెటిస్‌కు దారితీస్తుంది. కొందరు ఒత్తిడి నుంచి ఉపసమనం పొందేందుకు సిగిరెట్‌లను ఉపయోగించడం వలన కూడా డయాబెటిస్‌కు దారితీస్తున్నట్లు అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

- **లక్షణాలు:**

మధుమేహం ప్రారంభదశలో లక్షణాలు స్పష్టంగా కన్పించకపోవచ్చు కానీ సాధారణంగా తరచూ మూత్ర విసర్జన, అతిగా దాహం, ఆకలి, అలసట, బరువు తగ్గడం, గాయాలు త్వరగా తగ్గకపోవడం, దృష్టి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్రతి ఒక్కరూ 45 ఏళ్లు దాటిన తర్వాత ముందుగానే పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు తీసుకోవడం మంచిది.

రాష్ట్రంలో మూడవ స్థానం...

2019-21 సంవత్సరాలలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిలాలో 15 నుంచి 49 సంవత్సరాల మధ్య వయస్సుల మహిళల్లో 19.8 శాతం మంది 140 కంటే ఎక్కువ బ్లడ్ షుగర్‌తో బాధపడుతున్నట్లు పేర్కొన్నాయి. అదే పురుష లలో 15 నుంచి 54 సంవత్సరాల మధ్య వయస్సులలో 22 శాతం నుంచి 24 శాతం బాధపడుతున్నట్లు పేర్కొన్నాయి. ఈ సర్వే ప్రకారం డయాబెటిస్‌లో మన ఉమ్మ డి జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచింది.

మధుమేహం వ్యాధి కాదు.. రుగ్మత



మధుమేహం (డయాబెటిస్) అనేది వ్యాధి కాదు. ఇది శారీరక రుగ్మత అని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఇన్సులిన్ రెసిస్టెన్స్ వలన టైప్-2 మధుమేహం వస్తుంది. మధుమేహ నివారణ అనే ది మన చేతుల్లోనే వున్నది. జీవన శైలిలో చిన్న చిన్న మార్పులతో ఈ రుగ్మతను అరికట్టవచ్చు.

-పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్, పోషకాహార నిపుణులు

డయాబెటిస్‌పై పరిశోధనలు



డయాబెటిస్ నివారణకు ఎన్నో కొత్త వైద్య విధా నాలు, ట్యాబ్లెట్లు, ఇన్సులిన్‌లు అందుబాటులోకి వ చ్చాయి. దీని నివారణకు ఎన్నో పరిశోధనలు జరు గుతున్నాయి. ముఖ్యంగా గుండె, కిడ్నీ మార్పిడిల మాదిరిగా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే ప్యాంక్రియాస్ కణాల మార్పిడికి సంబంధించిన పరిశోధనలు జరుగుతున్నాయి. వీటిలో బీటా సెల్స్‌ను ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం జరిగే పరిశోధనలు విజయవ ంతమైతే ప్రస్తుతం డయాబెటిస్ నివారణ కోసం ఉపయోగిస్తున్న టాబ్లెట్లు, ఇన్సులిన్‌లను ఇక వాటి అవసరం వుండదు.

-డాక్టర్ ఎ.ప్రవీణ్, తణుకు

సమ్మేటివ్ పరీక్షలు వాయిదా

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఏలూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):బాలల దినోత్సవానికే ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఆ మేరకు గురువారం ఆంధ్రజ్యోతిలో బాలల దినోత్సవం నాడు పరీక్షలా? శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరగాల్సిన సమ్మేటివ్(ఎస్ఏ-1) పరీక్షలను ఈ నెల 17, 20వ తేదీలకు వాయిదా వేసింది. పరీక్షల వాయిదాకు సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల విద్యా శాఖ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ గురువారం జారీచేశారు. దీనికనుగుణంగా శుక్రవారం జరగాల్సిన సమ్మేటివ్ పరీక్షలను ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఈ నెల 17న, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు పరీక్షలను 20న నిర్వహిస్తారు. ఆ మేరకు ఈ నెల 14న జరగాల్సిన పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను సురక్షితంగా భద్రపర్చాలని, ఎట్టి పరిస్థితుల్లోను తెరవరాదని డీవైఈవోలు, ఎంఈవోలు, హెచ్ఎంలను డీఈవో వెంకట లక్ష్మమ్మ ఆదేశించారు.

ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కమిటీ ఎన్నిక

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):ఏఐటీయూసీ ఏలూరు జిల్లా నూతన అధ్యక్షుడిగా తొర్లపాటి బాబు, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి శ్రీనివాస డాంగేలను ఎంపిక చేశారు. గురువారం స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ జిల్లా విస్తృత సమావేశం నిర్వహించి ఎంపిక చేశారు. బీజేపీ అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో ఏఐటీయూసీ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి పాత కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలన్నారు.


గురుకుల పాఠశాలలో భోజనాలు పరిశీలిస్తున్న లక్ష్మీరెడ్డి

ముదిరిన కూరగాయలతో వంటలా..?

అంగన్‌వాడీ సిబ్బందిని ప్రశ్నించిన ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి

బుట్టాయగూడెం/జంగారెడ్డిగూడెం/నిడమర్రు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):వసతి గృహాలు, పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ ఈ.లక్ష్మీరెడ్డి సూచించారు. గురువారం ఆయన బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. పిల్లలకు వండిపెడుతున్న కూరగాయలు, ఆహారాన్ని పరిశీలన చేశారు. కూరగాయల నాణ్యత పట్ల ప్రిన్సిపాల్,వార్డెన్‌లను ప్రశ్నించారు. కొన్ని రకాల కూరగాయలు ముదిరిపోయినట్లు ఉన్నా యని మార్పు చేయాలని అటువంటి వాటిని పిల్లలకు పెట్టవద్దని తెలిపారు. తర్వాత బుట్టాయగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, జడ్పీ ఉన్నత పాఠశాలను, ఐటీడీఏ పరిధిలో నడుస్తున్న బాలికల కళాశాల వసతిగృహాన్ని సందర్శించి భోజనాలు పరిశీలించారు. అంతకుముందు మర్లగూడెంలో అంగనవాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో పని చేస్తున్న సిబ్బంది పనితీరు బాగాలేదని అన్నారు. కొలతల్లో తేడాలు ఉన్నాయని, రికార్డులు సక్రమంగా లేవని అన్నారు. అనంతరం జంగారెడ్డిగూడెంలో డాక్టర్ బీఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. వంటశాల, స్టోర్ రూమ్, కూరగాయలు, పప్పు, నూనె, కోడిగుడ్లు, తదితర నిత్యావసర సరుకుల నాణ్యతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నం వండినప్పుడు గంజి వార్చుతుండటాన్ని ఆయన గమనించారు. ప్రభుత్వం ఎన్నో పోషక విలువలున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పాఠశాలలకు అందజేస్తుందని ఆ బియ్యాన్ని అన్నం వండేటప్పుడు గంజి వారిస్తే పోషకాల న్నీ గంజి రూపంలో బయటకు పోతాయని, ఇక నుంచి అన్నం వార్చకూడదని సూచించారు. ఉంగుటూరు మండలం కైకరంలో అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల హాజ రును పరిశీలించి, కేంద్రంలో మెనూ అమలు విధానం తనిఖీ చేశారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి, బాధితురాలు పార్వతి

అప్పుడు మొత్తుకున్నా వినలేదు

- ఆస్తి కోసమే నా మనుమరాలిని చంపేశారు
- కేసు నీరుగార్చిన కారుమూరిపై చర్యలు తీసుకోండి
- మృతురాలి అమ్మమ్మ పార్వతి డిమాండ్

తణుకు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తణుకు మండలం ముద్దాపురంలో మూడేళ్ల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని ముళ్లపూడి నాగనిహారికది హత్యేనని ఎంత మొత్తుకున్నా అప్పట్లో పోలీసులు వినిపించుకోలేదని మృతిరాలి అమ్మమ్మ గజ్జరపు పార్వతి పేర్కొంది. గురువారం సాయంత్రం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆనాడు మంత్రిగా ఉన్న కారుమూరి నాగేశ్వరరావు ఒత్తిడితోనే పోలీసులు కేసును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. నేరచరిత్ర కలిగిన అల్లుడు ముళ్లపూడి శ్రీను, తన రెండో భార్య రూపాతో కలిసి తన మనవరాలిని అత్యంత క్రూరంగా చంపేశారని వాపోయింది. ఆస్తి కోసమే పథకం ప్రకారం తన మనుమరాలిని పొట్టన పెట్టుకున్నారని కన్నీటి పర్యంతమైంది. 2003లో నాగ నిహారిక తల్లి వసంతను కూడా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించింది. మనుమరాలిది హత్య అని చెప్పినా అప్పటి సిఐ ఆంజనేయులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారని అన్నారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఒత్తిడితో పోలీసులు కేసును పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చాక పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా హత్య అని నిర్ధారించి ఇప్పుడు నిందితులను అరెస్టు చేశారని చెప్పారు. మూడేళ్ల పాటు తమను క్షోభకు గురి చేసిన కారుమూరి వెంకట నాగేశ్వరరావుతో పాటు అప్పటి సీఐ అంజనేయులుపై చర్యలు తీసుకోవాలని పార్వతి డిమాండ్ చేసింది.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



కొయ్యలగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పొలం నుంచి ఇంటికి మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఒకరు అక్కడి కక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం బయ్య న్నగూడెం గ్రామం వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన బాలం కిషోర్(23) మృతి చెందాడు. పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా అదే రోడ్డులో ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో కిషోర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సోదరుడు బాలం నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల రెండు వాహనాలు చోరీ

పెదపాడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల రెండు వాహనాలు ఒకే రోజు చోరీకి గురయ్యాయి. ఏలూరు శివారున పొలం వద్ద ఉన్న టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు పెదపాడు గ్రామానికి చెందిన మానం సత్యనారాయణ రోడ్డుపై పెట్టి పొలం వెళ్లి తిరిగి వచ్చే సరికే వాహనం లేదు.. అప్పనవీడులోనూ 12న టాటా ఏస్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లారు. బాధితులు చలాది ప్రభాకరరావు, సత్యనారాయణలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసినట్లు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు.

పగలు టైలరింగ్.. రాత్రిళ్లు చోరీలు

నిందితుడి నుంచి భారీగా సొత్తు రికవరీ
వివరాలు వెల్లడించిన డీఎస్పీ జయసూర్య


వివరాలు చెబుతున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న టైలర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. భీమవరం రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం డీఎస్పీ ఆర్.జి.జయసూర్య మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. చినరంగనిపాలేనికి చెందిన పట్నాల మోహన లక్ష్మీ సాయి ప్రస్తుతం టైలరింగ్ వృత్తి చేసుకుంటున్నాడు. జల్సాలకు అలవాటు పడి చోరీలను ఎంచుకున్నాడు. భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ఇళ్లల్లో సుమారు 160 గ్రాముల బంగారం, భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 400 గ్రాములు వెండిని దోచేశాడు. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి ఈ నెల 12వ తేదీ సాయంత్రం డేగాపురం వద్ద పట్నాల మోహన లక్ష్మీ సాయిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అతడి నుంచి పైన తెలిపిన బంగారం, వెండి వస్తువులతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంటికి తాళాలు వేసి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ఒక వ్యక్తిని గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీవీ నగర్ సెంటర్‌లో రూరల్ ఎస్ఐ బి.నాగబాబు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక యువకుడు మోటారు సైకిల్ వదిలి పారిపోయే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకుని పరిశీలించగా 3 కేజీల 100 గ్రాముల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ యువకుడు పశ్చిమ బెంగాల్‌లోని ముషిదాబాద్ సంషేర్‌గంజి తాణా బాసుదెబ్పూర్ గ్రామం సచండపోస్టుకు చెందిన ఎస్.కె.అనురుల్(29)గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు


మృతి చెందిన భార్య వద్ద విలపిస్తున్న భర్త

గణపవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం చిన రామచంద్ర పురానికి చెందిన కొట్టు సత్యవతి (55) లారీ ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందింది. గణపవరం ఎస్.ఐ. మణికుమార్ తెలిపిన వివరాల మేరకు గురువారం చినరామచంద్రపురానికి చెందిన కొట్టు సత్యనారాయణ, సత్యవతి దంపతులు మోటార్ సైకిల్ పై వల్లూరు వెళ్తుండగా వరదరాజపురం శివారులో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యవతి అక్కడికక్కడే మృతి చెందగా భర్త సత్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. 108లో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ. తెలిపారు.

రెండు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 07619 సికింద్రాబాద్ నుంచి కాకినాడ టౌన్‌కు ఈనెల 11వ తేదీ ఆదివారం ప్రత్యేక రైలుగా నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుందని తెలిపారు. రైల్ నెంబర్ 06565 ఎస్ఎంవిటి బెంగళూరు నుంచి భగల్‌పూర్ అన్ రిజర్వుడు స్పెషల్ ట్రైన్ ఈనెల 15వ తేదీ శనివారం నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు కృష్ణరాజపురం, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, పలాస, బ్రహ్మపూర్, కుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, బాదర్క్, ఖరగ్‌పూర్, అండూల్, భట్టా నగర్, బార్ధమాన్, బర్‌షర్వా, సాహిబ్‌గంజి స్టేషన్లలో రైలు ఆగుతుందని తెలిపారు.

చోరీ కేసులో మరో నిందితుడి అరెస్టు

- రూ.12 లక్షలు రికవరీ చేశామన్న ఏఎస్పీ సుస్మిత


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సుస్మిత

జంగారెడ్డిగూడెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డి గూడెం మండలం లక్కవరంలో సెప్టెంబరు 23న వృద్ధ భార్య, భర్తలను తాళ్లతో కట్టేసి చోరీకి పాల్ప డిన మరో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత రామనాథన్ హెచ్చరించారు.గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ సుస్మిత రామనాథన్ వివరాలు వెల్లడించారు. లక్కవరం చోరీ కేసులో బాపట్ల జిల్లా స్టువర్టుపురానికి చెందిన కావేటి చిన్నాపై రాష్ట్ర వ్యాప్తంగా చిత్తూరు, బాపట్ల, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో పలు కేసులు ఉన్నా యన్నారు. నిందితుడి నుంచి రూ.12 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో స్టువర్టుపురానికి చెందిన అంగడి విల్సన్‌బాబు, గజ్జెల వాసు, లక్కవరం గ్రామానికి చెందిన దేవర శ్రీరామ్మూర్తి, షేక్ బాజీలను నేరం జరిగిన రెండ్రోజుల్లోనే అరెస్టు చేసి జైలుకు పంపామన్నారు. గతంలోనే వీరి నుంచి రూ.30 లక్షల విలువైన చోరీ సొత్తు, కావేటి చిన్నా నుంచి తాజాగా రూ.12 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నా మన్నారు. ఈ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీఐ ఎం.వి. సుభాష్, ఎస్సై ఎస్.కె.జబీర్, ఏఎస్ఐ సంపత్, పీసీలు షాన్ బాబు, ఎన్.రమేశ్‌లకు ఏఎస్పీ సుస్మిత చేతుల మీదుగా నగదు బహుమతి అందజేశారు.

కుమారుడు మాట వినడం లేదని తల్లి ఆత్మహత్య

భీమవరం క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు చెప్పిన మాట వినడం లేదని, బయటకు వెళ్లొద్దన్నా పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో ఒక మహిళ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరం మండలం గొగుతిప్ప గ్రామానికి చెందిన అంద్రాజు యేసమ్మ(36) 2023వ సంవత్సరంలో భర్త మృతి చెందడంతో భీమవరం పట్టణంలోని డీఎన్నార్ కళాశాల సమీపానికి వచ్చి అద్దెకు ఉంటోంది. ఆమెకు పదేళ్ల కుమారుడు ఉన్నాడు. కుమారుడు చెప్పిన మాట వినడం లేదని ఎన్నో సార్లు బాధపడింది. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి కుమారుడు తల్లికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన యేసమ్మ ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతురాలి సోదరుడు మైలా నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కడుపు నొప్పి తాళలేక వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక జీవితంపై విరక్తి చెంది ఒక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు పరిధిలోని శనివారపుపేటకు చెందిన ఆకుల రాంబాబు(23)కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కడుపునొప్పితో బాధపడుతున్న రాంబాబును అతని కుమారులు ఆంధ్రా ఆసుపత్రికి తీసుకెళ్లగా మూడ్రోజుల్లో ఆపరేషన్ నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. రాంబాబుకు కడుపునొప్పి తీవ్రంగా రావడంతో ఆ బాధను భరించలేక ఈనెల 12న యాసిడ్ తాగాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జంగారెడ్డిగూడెం గ్రంథాలయ కమిటీ నియామకం

జంగారెడ్డిగూడెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం గ్రంథాలయ నూతన కమిటీని ప్రభుత్వం నియమించింది. గ్రంథాలయ ఛైర్మన్‌గా బీజేపీ సీనియర్ నాయకుడు కొప్పాక శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఇనుముల వెంకట పాపారావు,కార్యదర్శిగా దోసూరి సుబ్బారావు, కోశాధికారిగా చింతల శ్రీను,సహాయ కార్యదర్శులుగా గుళ్ళపూడి కామరాజు, ముత్యాల దుర్గా వెంకటలక్ష్మి, గంగిరెడ్ల దుర్గ నియమితులయ్యారు. శుక్రవారం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఎమ్మెల్యే రోషన్ సమక్షంలో జరుగుతుందన్నారు.

నకిలీ ఏసీబీ అధికారులపై సమాచారమివ్వండి

ఏలూరు క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో ఏసీబీ అధికారుల పేరిట కొంత మంది నకిలీలు ఉద్యోగులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అవినీతి నిరోధకశాఖ డీఎస్పీ వి సుబ్బరాజు స్పందించారు. ఇటు వంటి నకిలీల ఫోన్ కాల్స్ నమ్మవద్దని, ఏసీబీ అధికారులు ఆ విధంగా ఎప్పుడూ ఫోన్ చేయరన్నారు. ఏసీబీ అధికారులమంటూ డబ్బులు డిమాండ్ చేస్తూ ఫోన్ కాల్స్ వస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

ఘనంగా టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారం

ఏలూరుటూటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యాలయంలో, టీడీపీ నగర కమిటీ, 14 అనుబంధ కమిటీలతో ఎమ్మెల్యే బడేటి చంటి ప్రమాణస్వీకారం చేయించారు.ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తల పార్టీ అని, కష్టపడిన ప్రతీ కార్యకర్తకు సీఎం చంద్రబాబు న్యాయం చేస్తారన్నారు. అందుకే నగర కమిటీతో పాటు అనుబంధ కమిటీలను నియమించామన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమి పార్టీలు ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఏలూరు నగర అధ్యక్షుడిగా చోడే వెంకటరత్నం, బీసీ సెల్ అధ్యక్షుడు తంగేటి మనోహర్, కల్చరల్ విభాగఅధ్యక్షులుగా గొర్రెల వెంకటరమణ, ఐటీడీపీ అధ్యక్షుడిగా రెడ్డి ఈశ్వరరావు, లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఇబ్రహీం షరీఫ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పెద్దాడ వెంకటరమణ, ఎస్టీ విభాగం అధ్యక్షులుగా మాణిక్యాలరావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కాశీచరణ్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా సూర్యనారాయణ, క్రైస్తవ విభాగం అధ్యక్షుడిగా ఎం.అబ్రహం, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా తవ్వా అరుణకుమారి, తెలుగు యువత అధ్యక్షులు కోణ మాణిక్యం, తెలుగు రైతు అధ్యక్షులుగా చల్లారి శ్రీనివాసరావు,మైనార్టీ విభాగం అధ్యక్షులు అబ్దుల్ రజాక్, వాణిజ్య విభాగాధ్యక్షులు మద్దుల జనార్దన్‌తో పాటు కమిటీ ఉపాధ్యక్షులు, ప్రమాణ స్వీకారం చేశారు.

తాపీ మేస్త్రికి ఆర్థిక సాయం

పెదవేగి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తు తీవ్రంగా గాయపడి, ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్న తాపీ పనిచేసుకుని జీవించే వ్యక్తికి చేయూత సంస్థ ఆర్థిక సాయం అందించింది. పెదవేగికి చెందిన దాసరి రామ్మోహనరావు తాపీ పని చేస్తూ ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడటంతో ఎడమకాలు విరిగింది. ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలితం లేదు. రెండోసారి శస్త్రచికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. దీంతో గ్రామ మాజీ సర్పంచ్ మాతంగి కోటేశ్వరరావు చేతుల మీదుగా బాధితుడు దాసరి రామ్మోహనరావుకు రూ.10వేలు అందించారు. చేయూత సభ్యులు మేకా లక్ష్మీనారాయణ, పరసా నాగార్జున, మరీదు లక్ష్మణరావు, రాజులపాటి చిన్నా, ఏనుగు రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు

టి.నరసాపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురంలో ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు ఎంపీడీవో జి.మణికుమారి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బిర్సా ముండా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19వ శతాబ్దపు చివరి రోజుల్లో నేటి బీహార్, జార్ఖండ్ అటవీ ప్రాంతంలో బ్రిటీష్ కాలంలో జరిగిన మిలీ నేరియన్ ఉద్యమానికి సారథ్యం వహించినట్టు ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర ప్రసాద్, పి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

» అధికారులకు ఎమ్మెల్యే చింతమనేని దిశానిర్దేశం

పెదవేగి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ప్రణాళికల్లో విజన్-2047 గేమ్ చేంజర్‌గా అవుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. విజన్-2047 ప్రాజెక్టులో భాగంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అందించిన నూతన లాప్‌టాప్‌లో అంశాలను సంబంధిత సిబ్బందితో కలిసి ప్రభాకర్ పరిశీలించి, చేయాల్సిన పనులపై సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన విజన్‌కు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. దీంతో పాటు షేడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామని ప్రభాకర్ తెలిపారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

జంగారెడ్డిగూడెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు ఇ.లక్ష్మీరెడ్డిని రేషన్ డీలర్లు కోరారు. గురువారం జంగారెడ్డిగూడెం డివిజన్ పర్యటనకు వచ్చిన ఆయనను రేషన్ డీలర్లు మర్యాదపూరంకంగా కలిసి ఘనంగా సత్కరించారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల రమేశ్, డివిజన్ అధ్యక్షుడు పఠాన్ అన్వర్ బాషా మాట్లాడుతూ బియ్యం పంపిణీలో సమస్యలు ఉన్నాయన్నారు. సానుకూలంగా స్పందించిన లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ పౌరసరఫరాల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. సీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, డీలర్లు చినరాజు, గుప్తా, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం : ఎస్‌ఐ

పెదవేగి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగంతో వ్యక్తి మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటుందని పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. మాదకవ ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై పెదవేగిలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం పిల్లల విద్య, భవిష్యత్‌పై ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. ఈగల్ టీమ్ ఆర్ఎస్‌ఐ బి.ఉదయ్‌భాస్కర్, హెచ్‌సీ బి.సూర్యచక్ర పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తాం : ఏడీఏ



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

పెదవేగి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయిలో ధాన్యం కొంటామని వ్యవసాయశాఖ ఏడీఏ అనిలకుమారి చెప్పారు. రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. పెదవేగి మండలం కొప్పాక సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏలూరు ఏడీఏ అనిలకుమారి, సొసైటీ ఛైర్మన్ కొసరాజు వీరవెంకట వరప్రసాద్‌తో కలిసి గ్రామ సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి గురువారం ప్రారంభించారు. ధాన్యం మాసూళ్ల చేయడానికి ముందే రైతు సేవా కేంద్రం ద్వారా కొనుగోలు కేంద్రానికి సమాచారం అందించాలని ఏడీఏ అనిల కుమారి అన్నారు. సొసైటీ కార్యదర్శి చల్లగొళ్ల రమేష్‌బాబు, గ్రామ ఉపసర్పంచ్ చల్లగొళ్ల వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించారంటూ ఏపీటీఎఫ్ అభ్యంతరం

» డీఈవో వెంకటలక్ష్మమ్మ దృష్టికి సమస్య

ఏలూరు అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జీరో సబ్జెక్టు టీచర్ల సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ క్లస్టర్ టీచర్లను పని సర్దుబాటుపై తాత్కాలికంగా నియమించడానికి జిల్లా విద్యాశాఖ గురువారం జారీ చేసిన ఉత్తర్వులు వివాదాస్పదమయ్యాయి. మున్సిపల్ క్లస్టర్ల టీచర్లలో అర్హులున్నప్పటికీ నిబంధనలను అతిక్రమించి ఇష్టానుసారంగా వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ డీఈవో వెంకటలక్ష్మమ్మను గురువారం రాత్రి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు, సంఘ నాయకులు కొండయ్య, శ్రీనివాస్, ప్రకాష్‌లు కలిసి అభ్యంతరం తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎంతమోలు సర్‌ప్లస్ టీచర్ల వివరాలపై అందజేసిన సమాచారంమేరకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరపాలని, సీనియర్లకు న్యాయం చేయాలని డీఈవోను అభ్యర్థించారు. దీనిపై డీఈవో వెంకటలక్ష్మమ్మను వివరణకోరగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే క్లస్టర్ టీచర్లతో సర్దుబాటు చేశామని, జూనియర్లను మాత్రమే జీరో సబ్జెక్టు టీచర్ల సమస్యవున్నచోట నియమించామని, ఇందులో వివాదాలేవీ లేవన్నారు.

సహకారం.. పునర్జీవం!

(5వ పేజీ తరువాయి)

సాకారం చేయడంలో సహకార సంస్థలు కీలక పాత్ర పోషించడమే కాకుండా, స్థానిక సమాజాలను శక్తివంతం చేయడానికి, ఆర్థిక స్వాలంబనను ప్రోత్సహించడానికి, సమ్మిళిత, స్థిరమైన అభివృద్ధికి మూలస్తంభంగా దోహదపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. రాబోయే కాలంలో ఆక్వా, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించే దిశగా కేంద్రంలో బీజేపీ సర్కార్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

మరింత ప్రగతికి వారోత్సవాలు : డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస్



జిల్లాలో సహకార సంఘాలు మరింత స్ఫూర్తిగా పనిచేయడానికి వారం రోజుల పాటు జరిగే వారోత్సవాల్లో మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపడుతాం. పలు రంగాల ప్రజలను భాగస్వామ్యం చేస్తాం. సిబ్బందిలో జవాబుదారీతనం పెంపు, రానున్న కాలంలో తీసుకోబోయే ప్రభుత్వ చర్యలను వివరించి మరింత కార్యోన్ముఖులను చేస్తాం.

రైతు బజారుకు మోక్షమెప్పుడో..

పునాదులతో ఆగిపోయిన పనులు
త్వరగా పూర్తి చేయాలంటూ ప్రజల వేడుకోలు



అడవిని తలపిస్తున్న రైతు బజార్ స్థలం. గతంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకం(ఇన్‌సెట్‌లో)

జంగారెడ్డిగూడెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలో రైతు బజారు నిర్మాణానికి మోక్షం కల్పించాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో జంగారెడ్డిగూడెం కూడా ఒకటి. దాదాపు 80 వేలకు పైగా జనాభా ఉన్న పట్టణంలో ఇప్పటికీ ఇక్కడ రైతు బజారు లేదనే విషయం ఆశ్చర్యం కలగక మానదు. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలతో కూరగాయలు కొనుగోలు చేస్తూ సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2004లో శంకుస్థాపన..

ఇరవై ఏళ్లుగా జంగారెడ్డి గూడెంలో రైతు బజార్ నిర్మాణానికి ఏదో ఒక ఇబ్బంది ఎదురవుతూనే ఉంది. స్థానిక ఊర చెరువు ప్రాంతంలోని 15వ వార్డులో రైతు బజారు కోసం కేటాయించిన స్థలంలో రైతు బజారు నిర్మాణానికి 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభం కాలేదు. ఆ తర్వాత 2020లో వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే వి.ఆర్.ఎలీజా శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి ఏఎంసీ నిధులు రూ.32.75 లక్షలు కేటాయించగా పునాదుల వరకే పనులు జరిగాయి. కానీ మెటీరియల్ వెళ్లడానికి రోడ్డు లేదనే ఉద్దేశంతోనో లేదా బిల్లులు చెల్లింపు జరగలేదనో కాంట్రాక్టర్ పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో ఐదేళ్లుగా ఎవరూ పట్టించుకోక పోవడంతో రైతు బజార్ ఉండాల్సిన స్థలంలో ఏపుగా చెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. విషపు పురుగులకు నిలయంగా మారింది. మరో పక్క ఈ స్థలం ఆక్రమణకు గురయ్యే అవకాశాలూ లేకపోలేదు.

రైతు బజారు ఏర్పాటుతో..

రైతు బజారు ఏర్పాటు చేస్తే జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, కామవరపుకోట, జీలుగుమిల్లి మండలాలకు చెందిన రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. పండించిన కూరగాయలను అమ్ముకోవడానికి అనువుగా ఉంటుంది. ఆరుగాలం కష్టపడి పండించిన కూరగాయలను దళారులకు తక్కువ ధరలకే అమ్ముకుంటున్నారు. అమ్ముకున్న పంటకు వెంటనే డబ్బు కూడా చేతికందదు. రైతు బజారు ఏర్పాటు చేయడం వల్ల రైతులు ఏ రోజు తెచ్చిన కూరగాయలు, ఆకుకూరలు అదే రోజు ప్రజలకు అమ్ముకునే అవకాశం ఉంది. ప్రజలకు తాజా కూరగాయలు, ఆకు కూరలు తక్కువ ధరకే దొరుకుతాయి.

మళ్లీ కొత్త టెండర్లు పిలుస్తాం..



2020లో ఏఎంసీ నిధులు రూ.32.75లక్షలు మంజూ రయ్యాయి. కానీ కాంట్రాక్టర్ రోడ్డు మార్గం లేదని, భవన నిర్మాణానికి ఇబ్బంది కలుగుతోందని పనులు నిలిపివేశారు. నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత కనీసం 25 శాతం వరకు పూర్తి కాని పనులన్నింటిని రద్దు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మళ్లీ కొత్త టెండర్లు పిలుస్తాం. టెండరు ప్రక్రియ పూర్తి కాగానే పనులు మొదలు పెడతాం.

షేక్ మెహరాజ్ బాషా, స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి, చింతలపూడి మార్కెట్ కమిటీ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్తీక వనసమారాధన బ్రోచర్ ఆవిష్కరణ

ద్వారకాతిరుమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దెందులూరు మండలం గోపన్నపాలెంలో ఈ నెల 18న జరగనున్న కార్తీక వన సమారాధన బ్రోచర్‌ను ద్వారకాతిరుమలలో నేతలు గురువారం ఆవిష్కరించారు. యాదవ సంఘ జిల్లా కార్యదర్శి కూరాకుల బుజ్జి, ఇతర నేతలతో కలిసి యాదవ కల్యాణ మండపం ఆవరణలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. గోపన్నపాలెంలోని పీఈటీ కళాశాల గ్రౌండ్స్ ఆవరణలో జరుగుతుందని మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని సంఘ నేతలు, సంఘ సభ్యులు, యాదవ సోదరులు పాల్గొనాలని కోరారు. ములకాల రాంబాబు, గుర్రముచ్చు వెంకన్న, పాకనాటి సుబ్బారావు, కంచు సుబ్బారావు పాల్గొన్నారు.



ఆందోళనకు దిగిన గ్రామస్థులు

దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం

కామవరపుకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని తడికలపూడిలో రోడ్లు గోతులమయం అవడంతో పాటు దుమ్ములేవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు గురువారం రాస్తారోకో జరిపారు. తాము అనారోగ్యం పాలుకాకుండా చూడాలని కొత్త చెరువు కాలనీ వాసులు కోరుతున్నారు.


సిబ్బందికి చెక్కుల అందజేత

ఏలూరు క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ అన్నారు. జిల్లా హోంగార్డ్స్ విభాగంలో పనిచేస్తూ పదవి విరమణ చేసిన జివి పద్మావతి, హోంగార్డు ఎండి ఆరిఫ్‌ఖాన్‌లకు జిల్లా పోలీస్ కార్యాలయంలో చెక్కులను అందించారు. ఉద్యోగ విరమణ చేసిన జీవీ పద్మావతికి ఐదు రూ.లక్షల 23 వేల 980, హోంగార్డు ఆరిఫ్‌ఖాన్‌కు రూ.ఐదు లక్షల 19 వేల 720 నగదు చెక్కును ఎస్పీ అందించారు.

జానకి రామయ్య సేవలు ప్రశంసనీయం

ద్వారకాతిరుమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాల ఉత్పత్తిదారులకు మండవ జానకీ రామయ్య అందించిన సేవలు ఎనలేనివని కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని రాళ్లకుంటలో కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తి దారుల అసోసియేషన్ పాలకేంద్రంలో గురువారం జరిగిన మండవ జానకి రామయ్య సంతాప సభలో ఆయన మాట్లాడారు. మండవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.యూనియన్ ఛైర్మన్‌గా పాడి రైతులకు ఎనలేని సేవలందించిన మండవ ఈ నెల 6న మృతి చెందడం బాధాకరమన్నారు. జి.నాగేశ్వరరావు, ఘంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం



జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒక వ్యక్తి కుటుంబానికి స్థానికులు ఆర్థిక సాయం అం దజేశారు. మండలంలోని తాడువాయి ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన కాకాని రవి(35) ఇటీవల దర్భ గూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఆర్అండ్ఆర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్అండ్ఆర్ కాలనీ కమిటీ అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, సెక్రటరీ బి.ప్రేమ్ కుమార్, కమిటీ సభ్యులు పెరుమాళ్ళ శ్రీను, రమణ య్య, బండి శ్రీను, రాములు, నరమల్ల మహేష్, థామస్ ఉన్నారు.

కార్పొరేట్‌కు లీజు విధానం తగదు

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):అసైన్డ్ భూముల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. గురువారం ఒక ప్రకటనలో ఆయన కార్పొరేట్ సంస్థలకు 99 సంవత్సరాల లీజు పేరుతో కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 33 లక్షల ఎకరాల భూములు పేదలకు పంచగా 13 లక్షల ఎకరాలు ఆక్రమణకు గురైనట్టు ప్రభుత్వాలే తెలియజేశాయన్నారు. వెంటనే లీజు విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ద్వారకాతిరుమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శాఖాగ్రంథాలయంలో ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని గ్రంథాలయ అధికారి ఎస్.సి.హెచ్.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, డిబేట్, చిత్రలేఖనం, క్యారమ్స్ వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. చివరి రోజున విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. విద్యార్థులు రూ.15 చెల్లిస్తే గ్రంథాలయంలో లైఫ్ లాంగ్ సభ్యత్వం ఇస్తామన్నారు.

● చింతలపూడి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాభివృద్ధికి అంతా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చైర్మన్ అనీల్ కుమార్, కార్యదర్శి బి.రమేష్, గ్రంథాలయ అధికారి కె.శేషగిరిరావు, కె.రమేశ్ పాల్గొన్నారు.

● పెదపాడు: గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు పాల్గొనాలని పెదపాడు తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలన్నారు. దుగ్గిపోగు జాన్‌బాబు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

లింగపాలెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో సారా తయారీని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెంట్ ఆవులయ్య తెలిపారు. మండలంలోని వేములపల్లిలో చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ ఆధ్వర్యంలో సారా తాగితే కలిగే అనర్థాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు సారా తయారీ దారులపై నిఘా ఏర్పాటు చెయ్యాలన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, ధర్మాజీగూడెం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

లింగపాలెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్టు ధర్మాజీగూడెం ఎస్‌ఐ కె.వెంకన్న తెలిపారు. అన్నపునేనివారిగూడెంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3వేల నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ధర్మాజీగూడెం ఎస్‌ఐ కే వెంకన్న తెలిపారు.

చెరువు ఆక్రమణలు తొలగించాలి

కామవరపుకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వేంపాడు రోడ్డులోని మంచినీటి కోనేరు చెరువు ఆక్రమణకు గురవుతోందని, చెరువు గట్టు వద్ద ట్రాక్టర్లతో చదును చేసి ఇళ్లు నిర్మించుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

పార్వతీదేవికి సహస్ర నామార్చన

పెదవేగి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వేగివాడ సమీపంలో కొలువైన శ్రీపార్వతీదేవికి కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గురువారం సహస్ర నామార్చన చేశారు. ఏలూరు మాదేపల్లిలోని శ్రీభ్రమరాంబ సహిత మల్లిఖార్జునస్వామి దేవస్థానం అర్చకులు కృష్ణ చైతన్య శర్మ ఆధ్వర్యంలో మాదేపల్లి మహిళా భక్త బృందం అమ్మవారికి సహస్ర నామార్చన, లలితా పారాయణలు నిర్వహించారు.



లక్ష్మీరెడ్డికి చిత్ర పటం అందజేస్తున్న ఈవో చందన

మద్దిక్షేత్రంలో ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి

జంగారెడ్డిగూడెంరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారిని స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖ మండపంలో వేద ఆశీర్వచనం గావించి దుశ్శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్ర పటంను ఈవో చందన బహూకరించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

ఏలూరు క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలని తమకు ఉన్న రక్షణ చట్టాలను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఒక్కరూ చట్ట ప్రకారం నడుచుకోవాలని, ఇతరుల హక్కులకు భంగం కల్పించకుండా జీవించాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు అన్నారు. ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీ విద్యార్థులకు శక్తి యాప్‌పై గురువారం సాయంత్రం అవగాహన సదస్సును నిర్వహించారు. పాల్గొన్న సీఐ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ మహిళల భద్రతకు సంబంధించి శక్తి యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు.

శ్మశానానికి దారి చూపండి : సీపీఐ

ఏలూరురూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపల్లిలోని దళితుల స్మశాన వాటికకు వెళ్లేందుకు రహదారి ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కోరారు. గురువారం ఏలూరులోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వెట్రి సెల్వికి వినతిపత్రం అందజేశారు. నూజివీడు రూరల్ మండలం పోతిరెడ్డిపల్లిలో సుమారు 2000మంది దళితకుటుంబాలు జీవిస్తున్నాయన్నారు.వీరి కోసం గ్రామంలో 2.75 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం శ్మశాన వాటికకు భూమి కేటాయించినట్టు వివరించారు. రహదారి లేకపోవడంతో దహన సంస్కారాల నిమిత్తం రహదారికి వెళ్లేందుకు దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బండి వెంకటేశ్వరరావు, బుట్టి రాయప్ప, పి.కిషోర్, నిమ్మగడ్డ నరసింహ,సీపీఐ నాయకులు మడుపల్లి నాగేంద్రరావు, కొమ్ము విజయ్, జుజ్జువరపు చంద్రరావు ఉన్నారు.

ఆటల పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

బుట్టాయగూడెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విశాఖలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ కేంద్రం రుషికొండలో ఈ నెల 10న ప్రారంభమైన క్రీడలు 12వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీల్లో ఏకలవ్య పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న టి.భువన చిత్ర లేఖనంలో ప్రథమ స్థానం, కబడ్డీలో బాలికలు ద్వితీయ స్థానం, వాలీబాల్‌లో తృతీయ స్థానాలు సాధించారు. దీంతో గురువారం ఐటీడీఏ వద్ద పీవో కె.రాములు నాయక్ విద్యార్థులను అభినందించారు. డీవైఈవో కుమార్, ఏఎంవో శిరమయ్య, సిఎంవో శ్రీనివాసరావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

మత్స్యకారులకు చెక్కుల అందజేత

భీమడోలు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ మత్స్యకార సంఘాల బలోపేతానికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు మండలంలోని ఆగడాలలంక, పూళ్ల, చెట్టున్నపాడు గ్రామాల్లోని మత్స్యకార సహకార సంఘాల యాజమాన్యాలకు మంజూరైన రూ.10 లక్షల 16 వేల విలువైన చెక్కును ఎమ్మెల్యే ధర్మరాజు లబ్ధిదారులకు అందజేశారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో మంజూరైన సొమ్మును సద్వినియోగం చేసుకుని మత్స్య ఉత్పత్తులను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఎఫ్‌డీవో దుర్గా భవానీ, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై ముగిసిన శిక్షణ

చింతలపూడి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండలం యండపల్లి గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐసీఆర్‌పీ మహిళలకు రెండ్రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి మాస్టర్ ట్రైనర్ మరికంటి గోపాలకృష్ణ తెలియజేశారు. మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి సహజ వ్యవసాయ ఉత్పత్తుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ ట్రైనీలతో పాటు రైతులు కూడా ఇందులో పాల్గొన్నారు.

దేవదాయ శాఖ పరిధిలోకి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

జంగారెడ్డిగూడెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావడానికి దేవదాయ శాఖ తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. అభ్యంతరాలను పదిరోజుల్లో తెలియజేయాలన్నారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని ప్రైవేటు వ్యక్తులు నడపడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు భక్తులు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉంటేనే అన్నీ పారదర్శకంగా జరుగుతాయని పలువురు అభిప్రాయపడ్డారు. దీంతో ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ అధికారులను ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదేశించారు.

మార్కండేయ స్వామికి రుద్రాభిషేకం

నిడమర్రు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భువనపల్లిలో ఉన్న ఉమా మార్కండేయ స్వామి ఆలయంలో మార్కండేయ స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రుద్రపాక శివశ్రీను శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఏకదశ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ అల్లుమోలు అంతర్వేది ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సంకు పుల్లయ్యను ఘనంగా సత్కరించారు. జనసేన నాయకులు స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోదరులు పత్సమట్ల భీమరాజు ఈ సత్కారం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు చీకట్ల నాగకృష్ణారావు, అల్లుమోలు అబ్బులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

దెందులూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు సహకారం అందిస్తున్నట్టు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. గురువారం దెందులూరులో రామశెట్టి సతీశ్‌కు రూ.40,800, కాటంరెడ్డి సుబ్రహ్మణ్యంకు రూ.15 వేలు చెక్కులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి..

టీడీపీ సీనియర్ నాయకులు, దళిత సంఘ జిల్లా నాయకుడిగా ఉన్న నిట్టా వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని కొవ్వలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ నిట్టా రజనీ శుభాకర్ తండ్రి వెంకటేశ్వరరావు(55) మృతి చెందడంతో ఆయన పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ మత్స్యకార సంఘ నాయకుడిగా జిల్లాలో దళిత సంఘ నాయకుడిగా పనిచేసిన వెంకటేశ్వరరావు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌కు జైన్

ఏలూరుఅర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈ నెల 14నుంచి 17వరకు జరుగనున్న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అండర్-19 విభాగం పోటీలకు ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు విద్యార్థి దర్శి జైన్ ఎంపికయ్యాడని స్కూలు ప్రిన్సిపాల్ సాయికుమారి తెలిపారు. విద్యార్థిని స్కూలు కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్ అభినందించారు.

చింతలపూడి గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అనిల్‌కుమార్



చింతలపూడి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా చింతలపూడికి చెందిన తనగాల అనీల్ కుమార్ నియమితులయ్యారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ సహకారంతో గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల నుంచి తాను బాధ్యతలు తీసుకుంటానని అనీల్ తెలిపారు.



జగన్‌తో డి.వి.ఆర్.కె.చౌదరి, అబ్బయ్య చౌదరి

వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా డీవీఆర్‌కే చౌదరి

దెందులూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా డి.వి.ఆర్.కె. చౌదరిని నియమిస్తూ వైసీపీ అధినేత జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆయనకు గురువారం నియామక పత్రాలు అందజేశారు. నియోజకవర్గంలోని పోతునూరు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, గతంలో కాంగ్రెస్‌లో పని చేశారు. ఏలూరు జిల్లా వైసీపీ కార్యదర్శిగా పనిచేస్తున్న డీవీఆర్‌కే చౌదరిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి కేటాయించిన జగన్‌కు, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, మాజీ ఎంపీ శ్రీధర్, కారుమూరి సునీల్‌కి, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒంటె శిలా విగ్రహ ప్రతిష్ఠ

కామవరపుకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని పాతూరు గ్రామంలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో శిలా విగ్రహ రూపంలో ఉన్న ఒంటెను గురువారం ప్రతిష్ఠించారు. తొలుత విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన నిర్వహించారు. ఒంటె వాహనానికి పంచామృతాభిషేకాలు, పండ్ల రసాలతో అభిషేకాలు చేసి హోమాన్ని నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, స్థానికులు సుధీర్‌బాబు, సూర్యనారాయణ, సత్యంబాబు పాల్గొన్నారు.

మట్టిపెడ్డల తొలగింపు

ఏలూరు క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వరి కోత యంత్రాలు వరి పొలాల్లో కోత కోసిన అనంతరం ఆ చక్రాల్లో చిక్కిన బంక మట్టిని సర్వీసు రోడ్డుపై వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సమాచారం పోలీసు ఉన్నతాధికారులకు అందడంతో డీటీ ఆర్టీ ఇన్‌ఛార్జి కానిస్టేబుల్ మధు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ఏలూరు సమీపంలోని 16వ నెంబర్ జాతీయ రహదారి చుట్టుగుంట బ్రిడ్జి వద్ద సర్వీసు రోడ్డులో బంకమట్టి పెల్లలు పడి ఉండడంతో హైవే మెయింటినెన్స్ సిబ్బంది ద్వారా వాటిని తొలగించి శుభ్రపరిచారు.

నేడు టీడీపీ ప్రజాదర్బార్

కొయ్యలగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేడు టీడీపీ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పారేపల్లి నరేశ్, బొబ్బర చినరాజు తెలిపారు. ఈ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10గంటల నుంచి 4గంటల వరకు స్థానిక మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలవరం టీడీపీ పార్టీ కన్వీనర్ బరొగం శ్రీనివాస్ అధ్యక్షతన గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని కూటమి నాయకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ సమస్యలను ఈ గ్రీవెన్స్‌లో తెలుపుకోవచ్చని అన్నారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
కైకలూరు, నూజివీడు
7 www.andhrajyothy.com ● శుక్రవారం 14 నవంబరు 2025

మంచినీటి చెరువు అభివృద్ధికి చర్యలు

ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):బొమ్మినంపాడు గ్రామ పంచాయతీ మంచినీటి చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ దారం సుధ, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు యర్రా రాంబాబు తెలిపారు. చెరువులో పేరుకు పోయిన గుర్రపుడెక్క, తూడు తొలగింపునకు, చెరువు తవ్వకానికి అవసరమైన నిధులు మంజూరుకు అంచనాలు సిద్ధం చేశామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించు కోకపోవడం వల్లే ఈపరిస్థితి నెలకొందని అన్నారు. గురువారం నుంచి డెక్క తొలగింపు పనులు చేపడుతున్నట్లు తెలిపారు.


ఉచిత వైద్య పరీక్షలు

ముసునూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూరేపల్లిలో ప్రసాద్ రోజ్ అండ్ కమ్యూనిటీ హెల్త్ కేర్ చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ ముళ్ళపూడి సుధారాణి, ఎంపీడీవో పిల్లి ఏసుబాబు సంయుక్తంగా ప్రారంభించారు. డాక్టర్ రాజేష్, డాక్టర్ రచనశ్రీలతోపాటు మరికొంత మంది వైద్యులు కంటి, దంత, గుండె పరీక్షలతోపాటు ఇతర వైద్యపరీక్షలను నిర్వహించారు. ఏపీవో రోజ్‌లీల మందులను ఉచితంగా అందజేశారు.

ప్రమాదాల రహదారులు



గోతులు పడ్డ చిన్నంపేట ప్రధాన రహదారి... చినపాలపర్రు గ్రామ అప్రోచ్ రోడ్డు దుస్థితి



ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొన్ని గ్రామాలకు రెండు, మూడు రహదారులు ఉంటాయి. మరికొన్ని గ్రామాలకు ఒకే రహదారి ఉంటుంది. ఉన్న ఆ ఒక్క రహదారి అధ్వానంగా తయారై అభివృద్ధికి నోచుకోకపోతే ఆ గ్రామస్థుల పాట్లు వర్ణనాతీతమనే చెప్పవచ్చు. ఆ కోవకు చెందందే ముదినేపల్లి మండలం చినపాలపర్రు గ్రామం. సుమారు 800 మంది జనాభా కలిగిన ఈ గ్రామానికి గుడివాడ - భీమవరం జాతీయ రహదారి నుంచి వెళ్ళే అప్రోచ్ రోడ్డు అధ్వానంగా తయారైంది. నడిచేందుకు కూడా నరకయాతనగానే ఉంది. అడుగడుగునా గోతులు ఉండడంతో వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. ట్రాక్టర్ల దమ్ము చక్రాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమైంది. చినపాలపర్రు గ్రామస్థులకు ఈ ఒక్క రోడ్డే దిక్కు కావడంతో అవస్థలు పడుతూ రాకపోకలు సాగించాల్సి వస్తున్నది. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం కలుగుతుందని గ్రామస్థులు చెబుతున్నారు.

చాట్రాయి: కాకర్ల-కోటపాడు ఆర్‌అండ్‌బీ రహదారి(కేకే రోడ్డు) పరిధిలోని చిన్నంపేట ప్రధాన రహదారికి పెద్ద పెద్ద గోతులు పడి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 6 నెలల క్రితం రోడ్డు గుంతలు నాసి రకంగా పూడ్చటం వలన వేసిన కొద్ది రోజులకే పరిస్థితి దారణంగా తయారైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గోతుల్లో ద్విచక్రవాహన చోదకులు అదుపుతప్పి పడిపోయి గాయాలపాలు అవుతున్నారని, లారీలు బస్సులు దిగబడిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే గోతులు పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు.

సేవింగ్స్ ఖాతాల సదుపాయం కల్పించాలి



ఎబ్ పోస్టుమాస్టర్‌కి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చాట్రాయి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ సబ్ పోస్టాఫీస్‌లో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)ఖాతాల సదుపాయం కల్పించాలని కోరుతూ సబ్ పోస్టుమాస్టర్ బి.రాంబాబుకు గురువారం బీజేపీ నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. వ్యాపార కూడలి అయిన చనుబండ సబ్ పోస్టాఫీస్‌లో ఈ సదుపాయం లేక పోవటం వలన గ్రామాలలో బ్రాంచ్ పోస్టాఫీసులకు వెళ్ళవలసి వస్తున్నదని, ఫలితంగా ఉపా ధి కూలీలు, పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రతి ఇంటికి మంచినీటి పంపు



మంచినీటి పంపును ప్రారంభిస్తున్న సర్పంచ్ మెండా ఝాన్సీ

మండవల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఇంటికి జలజీవన్ మంచినీటి పంపు ఇస్తామని, ఇంటికి ఒక పంపు మంజూరవుతుందని సర్ప ంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు పేర్కొన్నారు. మండవల్లి గ్రామ పంచాయతీలో జలజీవన్ మిషన్ మంచినీటి పంపులను గురువారం ఆమె ప్రారంభించారు. పంపులేని వారు ఇంటి పన్ను, ఆధార్‌కార్డు, రైస్‌కార్డు జిరాక్స్ తీసుకుని సచివాలయంలో ఇవ్వాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గిరిజకుమారి, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రేమించి మోసగించిన యువకుడిపై కేసు

ముసునూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన యువతిని ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన ఆముదాల వెంకటరత్నం నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అయితే వెంకటరత్నం మరో యువతితో వివాహం చేసుకుంటున్నాడని తెలిసి, ఈ నెల 12వతేదీన బాధిత యువతి రమణక్కపేట వెళ్ళి వెంకటరత్నాన్ని నిలదీసింది. దీంతో వెంకటరత్నం, అతని తల్లి, కుటుంబసభ్యులు బాధితురాలిపై కర్రలతో దాడి చేయడంతో ఆమె గాయ్యాలపాలైంది. బాధితురాలు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆసుపత్రి నుంచి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ బస్సుల ఢీ



ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి బంటుమిల్లి నుంచి గుడివాడ వెళ్ళే ఆర్టీసీ బస్సు బస్‌స్టేషన్‌లో పాయింటులో ఆగకుండ డ్రైవర్ ముందుకు వెళ్ళిపోయి తిరిగి బస్సును బ్యాక్ చేస్తూ అదే సమయంలో పాయింటులోకి వచ్చిన మచిలిపట్నం డిపో ఆర్టీసీ బస్సు ఎదుటి భాగాన్ని ఢీ కొంది. దీంతో ఒక్క సారిగా మచిలీపట్టనం బస్సులోని ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ముదినేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలనం చేసి ఈ వారోత్సవాలను ప్రారంభిస్తారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న విద్యార్థులకు ఆటలు, వ్యాసరచన పోటీలు, 17న కవి సమ్మేళనం, 18న ఇంటర్మీడియట్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు, 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రగతి పథంలో మహిళపై సదస్సు, 20న విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని గ్రంథాలయాధికారిని ఎం శ్రీదేవి తెలిపారు.

చాట్రాయి: మండలంలోని చనుబండ శాఖా గ్రంథాలయంలో 14వతేదీ నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, వివిధ రంగాల ప్రముఖులు, తల్లిదండ్రులు ఈ వారోత్సవాలలో పాల్గొని జయప్రదం చెయ్యాలని శ్రీకాంత్ కోరారు.

ముసునూరు: మండలంలోని గోపవరం, ముసునూరు గ్రామాల్లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు సునీల్‌కుమార్, టి.రాజేశ్వరి తెలిపారు. వారోత్సవాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా సర్పంచ్‌లు కంచర్ల వాణి, కొండేటి విజయలక్ష్మి యిర్మీయాలు విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులకు అనేక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆగిరిపల్లి: నేటి నుంచి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక బ్రాంచి గ్రంథాలయాధికారి ఈజీఎస్వి కుమార్ తెలిపారు. కృష్ణా జిల్లా గ్రంథలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈవారం రోజులు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

గిరిజన సాంప్రదాయాలను కాపాడదాం



మాట్లాడుతున్న ఎంపీడీవో రాఘువేంద్రనాథ్

నూజివీడు టౌన్, నవంబరు 13, (ఆంధ్ర జ్యోతి): గిరిజనుల సాంప్రదాయాలను కాపాడేం దుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని నూజివీడు ఎంపీడీవో చెన్న రాఘవేం ద్రనాథ్ అన్నారు. నూజివీడు మండలం ఓగిరాల తండా లో బిర్సా ముండా 15వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనుల హక్కులను కాపాడేందుకు బిర్సా ముండా చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమశాఖ అధికారిని షేక్ రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా కొత్తపల్లి, నారాయణపురం, ఊటుకూరు, వాడవల్లి, అల్లూరు, దేవపూడి, వణుదుర్రు గ్రామాల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఈ పూర్ణచంద్రరావు తెలిపారు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

క్లోరోసిస్‌పై అవగాహన



నూజివీడు టౌన్, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి) : క్లోరోసిస్‌పై ప్రతి ఒక్కరు అవగాహనతో ఉండాలని గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శ్రీనివాస్ గౌతమ్ అన్నారు. నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో క్లోరోసిస్‌పై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లలపై క్లోరోసిస్ ప్రభావం అత్యధికంగా ఉంటుందన్నారు. క్లోరోసిస్ సోకిన వారి దంతాలు పసుపు రంగులోకి మారతాయి అన్నారు. గర్భిణీలు రక్తహీనతకు ప్రధాన కారణం క్లోరోసిస్ అని దాని వల్ల తల్లి బిడ్డలకు ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జి.శ్రీనివాస్, ఏఎన్ఎం నాగమల్లేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్తీక వనసమారాధన బ్యానర్‌తో అధ్యాపకులు

డిగ్రీ కళాశాలలో వనసమారాధన

కైకలూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో వనసమారాధనల ద్వారా విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావాలు పెరిగేందుకు దోహదపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత అన్నారు. గురువారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి ఉసిరి చెట్టుకు పూజలు చేసి దీపారాధన చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అడపా కేదారి, జ్ఞానప్రసూనాంబ, జాలబాబు పాల్గొన్నారు.

నేడు షష్టి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష


ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 26 నుంచి డిసెంబర్ 8 వరకు జరుగనున్న షష్టి కల్యాణోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించేందుకు ప్రభుత్వ శాఖల అధికారుల కో - ఆర్డినేషన్ సమావేశం శుక్రవారం జరగనుంది. ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కూడా పాల్గొని ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షిస్తారు. ఆర్డీవో ఆదేశాల మేరకు ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, పోలీస్, పంచాయతీరాజ్, అగ్నిమాపక దళశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, దేవాదాయశాఖ తదితర శాఖల అధికార్లు, సిబ్బంది పాల్గొంటారని దేవస్థానం అసిస్టెంట్ కమీసనర్ ఆర్ గంగా శ్రీదేవి తెలిపారు. ఇదిలా ఉండగా గురువారం తహసిల్దార్ లతీఫ్ పాషా ఈ సమావేశం నిర్వహణపై దేవస్థానం కార్యాలయంలో అసిస్టెంట్ కమీషనర్‌తో చర్చించి ఏర్పాట్లను పరిశీలించారు.

సహకారం.. పునర్జీవం!

(5వ పేజీ తరువాయి)

సాకారం చేయడంలో సహకార సంస్థలు కీలక పాత్ర పోషించడమే కాకుండా, స్థానిక సమాజాలను శక్తివంతం చేయడానికి, ఆర్థిక స్వాలంబనను ప్రోత్సహించడానికి, సమ్మిళిత, స్థిరమైన అభివృద్ధికి మూల స్థంభంగా దోహదపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. రాబోయే కాలంలో ఆక్వా, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించే దిశగా కేంద్రంలో బీజేపీ సర్కార్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

మరింత ప్రగతికి వారోత్సవాలు



జిల్లాలో సహకార సంఘాలు మరింత స్ఫూర్తిగా పనిచేయడానికి వారం రోజుల పాటు జరిగే వారోత్సవాల్లో మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపడతాం. పలు రంగాల ప్రజలను భాగస్వామ్యం చేస్తాం. సిబ్బందిలో జవాబుదారీతనం పెంపు, రానున్న కాలంలో తీసుకోబోయే ప్రభుత్వ చర్యలను వివరించి మరింత కార్యోన్ముఖులను చేస్తాం.

\- డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



బ్యాంకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

కైకలూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం డిజిటల్ లావాదేవీల్లో సైబర్ నేరగాళ్ళు ఎక్కువయ్యారని ప్రజలను అప్రమత్త త చేయాల్సిన బాధ్యత బ్యాంకుల సిబ్బందిపై కూడా ఉందని కైకలూరు టౌన్ సీఐ ఏవీఎస్ రామకృష్ణ అన్నారు. గురువారం కైకలూరు టౌన్‌లో పలు బ్యాంకుల్లో అవగాహన సదస్సులను నిర్వహించారు. బ్యాంకు సిబ్బందికి సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించి బ్యాంకింగ్ రం గంపై ఆధారపడి ఎదు ర్కొంటున్న ప్రధాన సైబ ర్ మోసాలను వివరిం చారు. ఇటీవల సైబర్ నేరగాళ్ళు సీబీఐ, పోలీస్, నార్కోటిక్స్ వంటి సంస్థల నుంచి మాట్లాడుతున్నట్లు ప్రజలను నమ్మించి నేరాల్లో ఇరికి స్తామని భయ పెట్టి వారి ఖా తాల్లోని డబ్బులను ఖాళీ చేస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వ సంస్థ అయి నా ప్రజలను ఫోన్లో డబ్బులు డిమాండ్ చేయదని అలాంటి కాల్స్ వస్తే వాటిని వెంటనే కట్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చేలా బ్యాంకు ఖాతాదా రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో టౌన్ ఎస్సై ఆర్.శ్రీను పాల్గొన్నారు.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న బ్యాంకు రీజనల్ మేనేజర్ పాపయ్య

ముదినేపల్లి, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు లంచాలు డిమాండ్ చేస్తే విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గుడివాడ రీజియన్ రీజనల్ మేనేజర్ డి.పాపయ్య తెలిపారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా గురువారం అల్లూరిలోని ఏపీ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ కార్యాలయంలో జరిగిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ శాఖ కార్య కలాపాలపై కూడా ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలను ప్రోత్సహించ వద్దన్నారు. బ్యాంకు గుడివాడ రీజియన్ క్రెడిట్ విభాగం హెచ్‌వోడీ సీహెచ్ చంద్రశేఖర్, అల్లూరు బ్రాంచి మేనేజర్ ఎస్.రవి, ఎఫ్ఎల్‌సీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై సీడీపీవో ఆగ్రహం



రమణక్కపేట అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీవో విజయకుమారి

ముసునూరు, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారం పంపిణీ సక్రమంగా చేయకపోతే చర్యలు తప్పవని నూజివీడు సీడీపీవో పి.విజయకుమారి హెచ్చరించారు. రమణక్కపేటలో అంగన్‌వాడీ కేంద్రం-1లో పౌష్టికాహా రం పంపిణీపై వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరి శీలించారు. అనంతరం ఈ కేంద్రం పరిధిలో ఉన్న గర్భిణులు, బాలిం తల ఇంటికి వెళ్ళి పౌష్టికాహార పంపిణీపై వివ రాలు సేకరించారు. అంగన్‌వాడీ కార్యకర్త తమకు సక్రమంగా పౌష్టికాహారం ఇవ్వడం లేదని వారు సీడీపీవోకు చెప్పినట్లు సమా చారం. అంగన్‌వాడీ కార్యకర్త పనితీరుపై సీడీపీవో ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ధాన్యం తేమ నాణ్యత పరిశీలిస్తున్న ఏవో భవాని

ఆగిరిపల్లి, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): మండలంలో తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఏవో జొన్నలగడ్డ భవాని తెలిపారు. ఆగిరిపల్లి, చొప్పరమెట్ల ఈదుల గూడెం, సూరవరం, నరసింగపాలెం, అడవినెక్కలం, బొద్దనపల్లి, నూగొండపల్లి, ఈదర - 1 రైతు సేవా కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. బొద్దనపల్లి రైతు సేవా కేంద్రంలో ధాన్యం తేమ నాణ్యత పరిశీలించారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్), రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్పి వో)ల ద్వారా కొనుగోలు జరుగుతుందని తెలిపారు. రైతులందరూ రైతు సేవా కేంద్రా లను సంప్రదించి ధాన్యం విక్రయించాలన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన



చాట్రాయిలో టెన్త్ పరీక్షా కేంద్రానికి విచ్చేసిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆశ

చాట్రాయి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలోని జడ్పీ హైస్కూల్, ఆర్సీయం స్కూల్ టెన్త్ పరీక్షా కేంద్రాలను గురువారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆశ పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలోని సౌకర్యాలు, ఇతర అంశాలను ఆమె తనిఖీ చేసి అధికారులను సూచనలు చేశారు. టెన్త్ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టంగా జరపాలని ఆదేశించారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను ప్రశ్నలు అడిగి, అభ్యాసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు 100 రోజుల ప్లాన్‌ను అనుసరించి మంచి ఫలితాలు సాధించాలని ఉద్బోధించారు. ఆమె వెంట నూజివీడు డీవైఈవో సుధాకర్, చాట్రాయి ఎంఈవో-1 మాసగిరి శ్రీనివాస్ ఉన్నారు.

నేడు శ్యామలాంబకు గాజుల అలంకారం



కైకలూరు, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఈ నెల 14వ తేదీన కైకలూరు శ్రీశ్యామ లాంబ అమ్మవారు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. కార్తీక మాసం సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల గాజులతో అలంకారం చేస్తారు. ఈ అలంకారంలో భక్తులు అమ్మవారిని దర్శిం చుకునేందుకు పెద్దఎత్తున తరలివస్తారు. అలాగే 15వ తేదీన అమ్మవారి ఆలయంలో కోటి వొత్తుల పూజ నిర్వహి ంచనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎన్‌కె శేఖర్ తెలిపారు.

లక్ష్మీనారాయణ విగ్రహ పునఃప్రతిష్ఠ



లక్ష్మీనారాయణ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామం లోని కోదండ రామాలయంలో లక్ష్మీనారాయణ స్వామివార్ల విగ్రహాలు, శివలింగ పునఃప్రతిష్ఠ కార్యక్రమం వైభవోపేతంగా సాగింది. ఈ సందర్భంగా వేదమంత్రాలు నడుమ లక్ష్మీనారాయణ కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని రుత్వికులు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అపరభద్రాద్రిలో కార్తీక దీపోత్సవం





విద్యుత్ దీపాల వెలుగులో కోదండ రామాలయం

చాట్రాయి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అపరభద్రాద్రి చనుబండ శ్రీకోదండరామాలయంలో బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చి ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



ముసునూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాట్రేనిపాడులో అయ్యప్ప స్వామి పడిపూజను బుధవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్ప దీక్షాపరులు, గ్రామ ప్రముఖులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన పడిపూజను వేద పండితులు మురళీ నంబూదిరి శాస్త్రోక్తంగా జరిపారు. ఏలూరుకు చెందిన తడికిమళ్ళ ప్రసాద్ గురుస్వామి భజన బృందం అలపించిన భక్తిగీతాలు భక్తులను అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 2వేల మంది అయ్యప్ప, భవానీ, శివమాల దీక్షాపరులతోపాటు భక్తులకు సైతం టీడీపీ నాయకులు రాపర్ల మురళీ, రాపర్ల ప్రతాప్, పర్వతనేని సాంబశివరావు తదితరులు అల్పాహారం ఏర్పాటు చేశారు. బలివే ఆలయ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, వేంపాడు డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, ఉప సర్పంచ్ రాపర్ల సత్యనారాయణ, గద్దల మోహన్‌రావు తదితరులు పడిపూజలో పాల్గొన్నారు.

సైకిల్‌పై శబరిమల యాత్ర

మండవల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శబరిమల కొండకు అయ్యప్ప భక్తుడు సైకిల్‌యాత్ర చేస్తూ గురువారం బయలుదేరారు. మండవల్లి మండలం లోకుముడి ఏలూరురోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం నుంచి మర్రాపు జగదీష్ స్వామి శబరిమల యాత్రకు బయలుదేరారు. సైకిల్‌యాత్ర దిగ్విజయంగా జరగాలని ఆలయం వద్ద అప్పారావు గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, మర్రాపు జగదీష్ స్వామికి వీడ్కోలు పలికారు.



వాలీబాల్ విజేతలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు హీల్ విద్యార్థులు

ఆగిరిపల్లి, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు హీల్ విద్యా సంస్థ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ యలమంచిలి లతా చౌదరి తెలిపారు. ఈనెల 12వ తేదీన కానూరు సిద్ధార్థ స్కూల్ ఆవరణలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గోల్డెన్ జూబ్లీ ఫెస్ట్ అంతర్ జిల్లా ఛాంపియన్‌షిప్ పోటీల్లో తోటపల్లి హీల్ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వాలీబాల్ అండర్ - 17 విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. 11 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని అన్నారు. విద్యార్థులను హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మిక్కిలినేని హరీష్, కోచ్ జైట్లీ, పీఈటీ నాగరాజు, ఎ శ్రీనివాస్‌రెడ్డి, గోపి, తదితరులు అభినందించారు.